నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నేటి కందం- నేటికి అందం**

పరిపాలన సులభముగా
జరుగుటకై చంద్రబాబు చక్కని గతిలో
నిరువది యెనిమిది జిల్లా
నిరువది యారుకు బదులుగ నేర్పరచె ధృతిన్ !!

(పరిపాలనా సౌలభ్యం కోసం ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు 28 జిల్లాలను ఈరోజు ఏర్పాటు చేసి ప్రకటించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210




# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


**చురక**

కాలానుగుణంగా
కదిలేటి భావాలు
సామాజిక ప్రగతికి
చైతన్యపు జీవాలు.
సనాతన వల వేస్తే
సాంకేతిక పరుగులు
ఆగుతాయా ఎప్పుడైనా
అధునికం మెరుగులు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 31-12-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:117 పేజీలు:6 వెల: రూ.1/-


## జర్నలిస్టు సంఘాలతో సమావేశమవుతానన్న మంత్రి పొంగులేటి..!

హైదరాబాద్, డిసెంబర్ 30: అక్రిడిటేషన్ల విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 252తో తమకు అన్యాయం జరుగుతుందని డెస్క్ జర్నలిస్టులు గడిచిన వారం రోజులుగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతూ.. టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్టీ నేతలు మంగళవారం సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు.

డెస్క్ జర్నలిస్టులకు గతంలో లాగే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జీవో 252 ని సవరించాలని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. స్పోర్ట్స్, కల్చరల్, ఫీచర్ ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ఫెడరేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు సంఘాల వినతిపై మంత్రి పొంగులేటి కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

రిపోర్టర్లతోపాటు డెస్క్ జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు ఉంటాయని, డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలు పడొద్దని ఆయన చెప్పినట్లు తెలిసింది. త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తానని కూడా చెప్పినట్లు సమాచారం. జర్నలిస్టులకు ఇబ్బంది లేకుండా జీవో 252ను సవరిస్తామని మంత్రి చెప్పనట్లు తెలుస్తోంది.

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెలుగు రాష్ట్రాలలో ఆధ్యాత్మిక శోభ






హైదరాబాద్ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెలుగు రాష్ట్రాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు వైష్ణవ ఆలయాలకు తరలివెళ్లి.. ఉత్తర ద్వార దర్శనాలు చేసుకుంటున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలో తెల్లవారు జామునే ఉత్తర ద్వారాన్ని తెరిచారు. దీంతో భక్తులు పెద్ద ఎత్తున శ్రీవారిని దర్శించుకుంటున్నారు. వేములవాడలో రాజన్న ఆలయానికి అనుబంధంగా ఉన్న భీమన్న గుడిలో ఉత్తర ద్వార దర్శనాలు నిర్వహించారు..తెలంగాణలో యాదగిరిగుట్టలో ఉదయం 5.40 నిమిషాల నుంచి ఉత్తర గోపురం ద్వారా లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి అనుమతిస్తున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలోనూ ఘనంగా వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభమైంది.

గరుడ వాహనంపై శ్రీరామచంద్రస్వామి, గజవాహనంపై సీతమ్మ, హనుమత్ వాహనంపై లక్ష్మణుడు దర్శనమిచ్చారు.వైకుంఠ ఏకాదశి సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కొండగట్టు శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వార దర్శనానికి అనుమతిస్తుండటంతో భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. కామారెడ్డి జిల్లాలో శ్రీ వేంకటేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి ఆలయంలోనూ వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు.

## మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి

### గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి హర్షం




జనగాం డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ఈసారి మహా జాతర నిర్వహణ 200 ఏళ్లు పాటు చెక్కుచెదరకుండా నిలిచేలా గెద్దెల శాశ్వత పునర్నిర్మాణం మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టడం పట్ల గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి హర్షం వ్యక్తం చేసారు.మొత్తం 251 కోట్లతో మేడారం సమగ్ర అభివృద్ధి గద్దెల విస్తరణకు 101 కోట్లు 4000 టన్నుల గ్రానైట్ తో గద్దెలకు ప్రాంగణ నిర్మాణం 750 మంది కోయ వంశీయుల పేర్ల పేర్లకు సంబంధించిన 7,000 పైగా శిల్పాలు 930 ఏళ్ల కొయ్యల తాళపత్ర గ్రంధాల ఆధారంగా శిల్ప రూపకల్పన 46 స్తంభాలతో 271 చ. మీ విస్తరణలో ప్రకారం 8 స్తంభాలతో వృత్తాకారం గద్దె నిర్మాణం 40 అడుగుల వెడల్పుతో 3 స్వాగత తోరణాలు 30 అడుగుల వెడల్పుతో 5 స్వాగత తోరణాలు 50 అడుగుల వెడల్పుతో ప్రధాన స్వాగత తోరణం బండారి మరి వెదురు వేప ఇప్ప తదితర 12 రకాల పవిత్ర వృక్షాలు 140 రకాల ఆయుర్వేదిక్ మొక్కలు నాటుతున్నారు పూజార్ల సంఘం ఆమోదంతో అన్ని పనులు నాణ్యతలో ఎక్కడ రాజీలేదన్నారు. రోజువారి సమీక్షలు జనవరి 31 వరకు మహా జాతర కోటి మందికి పైగా భక్తులు తరలివచ్చే అంచనా. మేడారం స్థానిక శాసనసభ్యులు మంత్రివర్యులు సీతక్క ప్రభుత్వ సలహాదారుడు వేమనందరెడ్డి గార్లు ప్రత్యేక శ్రద్ధ చూపడం జరిగింది అని అన్నారు...

## డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్న రాకెట్ గుట్టు రట్టు

అహ్మదాబాద్ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );డ్రగ్స్ అక్రమ రవారణా చేస్తున్న డ్రగ్స్ రాకెట్‌ను అహ్మదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అహ్మదాబాద్ శివార్లలో కారు నుంచి రూ.15 లక్షల విలువైన హైబ్రీడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ రూ.10 వేలు చెల్లించి అతడి సాయంతో కొనుగోలు దారుల వద్దకు డ్రగ్స్ తరలిసున్నట్లు గుర్తించామని అన్నారు. డిసెంబర్ 31న వివిధ ఫామ్‌హౌజ్‌లలో నిర్వహించనున్న రేవ్ పార్టీల నిర్వహకులకు ఈ మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. అర్చిత్ అగర్వాల్ అనే డ్రగ్స్ సరఫరాదారు థాయిలాండ్ నుంచి హైబ్రీడ్ గంజాయిని తీసుకువచ్చి.. ఎవరికీ అనుమానం రాకుండా ఉండటానికి తన లగ్జరీ కార్లలో వీటిని అహ్మదాబాద్‌లోని పలు ప్రాంతాలకు తరలిస్తుంటాడని పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేయగా.. ప్రధాన నిందితుడి? అగర్వాల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నయని పేర్కొన్నారు.

## రైల్వే ప్రయాణీకులకు గుడ్‌న్యూస్.. సంక్రాంతికి మరో 11 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, డిసెంబర్ 30:సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారికి దక్షిణ మధ్య రైల్వే గుడ్ న్యూస్ చెప్పింది. ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా సంక్రాంతి పండక్కి మరికొన్ని ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఇప్పటికే ప్రకటించిన రైళ్లకు అదనంగా 11 రైళ్లను నడపనుంది. దక్షిణ మధ్య రైల్వే తీసుకున్న ఈ నిర్ణయంతో కొన్ని వేల మంది ప్రయాణీకులకు మేలు జరగనుంది. జనవరి 7వ తేదీనుంచి 12వ తేదీ మధ్య ఈ ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి.

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు

హైదరాబాద్ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); కొనుగోలుదారులకు శుభవార్త. గత కొన్ని రోజులుగా రాకెట్ వేగంతో దూసుకెళ్తున్న బంగారం వెండి ధరలకు కాస్త బ్రేక్ పడింది. గత మూడు రోజుల్లో బంగారం ధర రూ.3,850 మేర తగ్గింది. అటు వైట్ మెటల్ కూడా ఒక్కసారిగా పడిపోయింది. ఒక్కరోజే రూ.17 వేల మేర తగ్గింది.దరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,39,150కి తగ్గింది రెండు రోజుల క్రితం ఈ ధర రూ.1.43 లక్షలకు చేరిన విషయం తెలిసిందే. ఇక 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,28,850 పలుకుతోంది. ఇక ఆకాశమే హద్దుగా దూసుకెళ్లిన వెండి ధరలు భారీగా పడిపోయాయి. కిలో వెండి ధర ఒక్కరోజే రూ.17,200 తగ్గింది. దీంతో రూ.2.50 లక్షలు దాటిన కిలో వెండి ధర.. తాజా తగ్గింపుతో రూ.2,40,800కి పడిపోయింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ సిల్వర్ రేటు ఔన్సుకు 8 శాతం మేర పడిపోయి 72.93 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక ఈ ఏడాది వెండి ధర దాదాపు 138 శాతం పెరిగింది. బంగారం ధర 75 శాతం పెరిగినట్లు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.

## పుతిన్ నివాసంపై జరిగిన డ్రోన్ల దాడిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం

### -రష్యా ఆరోపణలను ఖండించిన ఉక్రెయిన్

న్యూ డిల్లీ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రష్యా అధ్యక్షుడు పుతిన్ నివాసంపై జరిగిన డ్రోన్ల దాడిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధ పరిస్థితుల్లో దాడులు చేయడం సహజమే కానీ.. నేరుగా అధ్యక్షుడి నివాసాన్ని లక్ష్యంగా చేసుకోవడం సరికాదని అన్నారు. ఇలాంటి చర్యలకు ఇది సరైన సమయం కాదని వ్యాఖ్యానించారు.అమెరికా ఫ్లోరిడాలోని మార్ ఏ లాగో రిసార్ట్‌లో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ట్రంప్ భేటీ అయ్యారు. అంతకుముందు మీడియాతో మాట్లాడిన ట్రంప్.. రష్యా అధ్యక్షుడు పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ దాడి చేసిందనే ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. తన నివాసంపై దాడి జరిగిందని స్వయంగా పుతిన్ ఫోన్ చేసి తనకు చెప్పాడని వెల్లడించారు. ఇది చాలా చెడ్డ విషయమని, ఈ విషయంలో చాలా కోపంగా ఉన్నానని తెలిపారు. అదే సమయంలో దాడిపై అనుమానాలను కూడా వ్యక్తం చేశారు. అసలు అటువంటి దాడే జరగకపోయే అవకాశం కూడా ఉందని.. దీనిపై పూర్తిగా నమ్మకం లేదని కూడా ఆయన వ్యాఖ్యానించారు.

### రష్యా ఆరోపణలను ఖండించిన ఉక్రెయిన్

పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడికి తెగబడిందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోస్ ఆరోపించారు. మాస్కో సమీపంలోని నోవ్గోరోడ్ ప్రాంతంలోని పుతిన్ నివాసాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ నెల 28, 29వ తేదీల్లో ఉక్రెయిన్ 91 దీర్ఘశ్రేణి డ్రోన్లను ప్రయోగించిందని తెలిపారు. అయితే వాటన్నింటినీ రష్యా గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని పేర్కొన్నారు. ఈ ఘటనను దేశ ఉగ్రవాద చర్యగా అభివర్ణించారు. ఇలాంటి చర్యలకు ప్రతీకారం తప్పదని హెచ్చరించారు. ప్రతీకార దాడుల కోసం ఇప్పటికే రష్యా సైన్యం టార్గెట్‌ను ఎంచుకున్నదని తెలిపారు. కాగా, రష్యా ఆరోపణలను ఉక్రెయిన్ ఖండించింది. పుతిన్ నివాసంపై దాడి చేశామన్న రష్యా వాదనలో నిజం లేదని స్పష్టం చేసింది.

## తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుదాం :మంత్రి జూపల్లి



హైదరాబాద్, డిసెంబర్ 30:తెలంగాణ పర్యాటక రంగాన్ని దేశానికే దిక్సూచిగా తీర్చిదిద్దాలని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వినూత్న మార్పులు అవసరమని పేర్కొన్నారు. ఇవాళ (మంగళవారం) తారామతి బరాదరిలో 'టూరిజం అండ్ ఇట్స్ విజన్ 2026' మేధోమథన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీటీడీసీ రూపొందించిన టేబుల్ క్యాలెండర్-2026ను ఆవిష్కరించారు.

అనంతరం టూరిజం అండ్ ఇట్స్ విజన్ - 2026 వర్క్ షాప్‌లో అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడారు మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. ప్రకృతి, వారసత్వ సంపదే తెలంగాణ బలమని చెప్పుకొచ్చారు. కొత్త అద్భుతాలు కాదని.. ఉన్న వనరులకు మెరుగులు పరిస్తే చాలని తెలిపారు. దేశీ, విదేశీ పర్యాటకులు తెలంగాణ వైపు చూసేలా తాము ప్రణాళికలు రచిస్తున్నామని వివరించారు .

గ్రామీణ అద్భుతాలను నగరవాసులకు చేరవేయాలని సూచించారు. పర్యాటక రంగంలో నూతన ఒరవడి రావాలని కోరారు. పర్యాటక అద్భుతాలను ప్రపంచానికి చూపాలని అన్నారు. తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుదామని తెలిపారు. వినూత్న ఆవిష్కరణలతో పర్యాటకులను ఆకర్షించాలని చెప్పుకొచ్చారు. వసతులు, హాస్పిటాలిటీలో రాజీ పడొద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

## వాహనాల రద్దీపై అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలి


### -మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి

హైదరాబాద్ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సంక్రాంతికి వెళ్లేవారికి ఇబ్బందులు లేకుండా చూడాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. గతంలో ఎదురైనా అనుభవాల దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. రహదారిపై రద్దీ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై కోమటిరెడ్డి సమీక్ష జరిపారు. హైదరాబాద్ - విజయవాడ హైవేపై జనవరి 8 నుంచి వాహనాల రద్దీ ఎక్కువ ఉంటుందని, రోజుకు సుమారు లక్ష వాహనాల ప్రయాణం సాగుతుందని తెలియజేశారు. వాహనాల రద్దీపై అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రేపు తూప్రాన్ పేట్, అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతాల్లో పర్యటిస్తానని కోమటి రెడ్డి పేర్కొన్నారు. ఎల్బీనగర్ నుంచి రామోజీ ఫిల్మ్ సిటీ వరకు రద్దీ ఎక్కువగా ఉంటుందని, జాతీయ రహదారిపై వాహనాలు ఆగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పండగ రద్దీ ఉన్న రోజుల్లో భారీ యంత్రాలతో జరిగే పనులు నిలిపివేయాలని, అత్యవసరంగా చేయాల్సిన పనులు రాత్రి వేళల్లో మాత్రమే చేయాలని అన్నారు. అన్ని రహదారుల లేన్లు వాహనాల రాకపోకలకు అందుబాటులో ఉంచాలని, రోడ్డు పనులు జరుగుతున్న ప్రతి చోట ట్రాఫిక్ బోర్డులు పెట్టాలని చెప్పారు. ట్రాఫిక్ మళ్లింపులు, నియంత్రణ అంశాల్లో సమన్వయం పాటించాలని, టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా అదనపు బృందాలు మోహరించాలని కోమటి రెడ్డి ఆదేశించారు.

## శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో..

### -డీజీపీ శివధర్ రెడ్డి
### -గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో ఈ ఏడాది నేరాల
### -సంఖ్య 2.33 శాతం తగ్గింది

హైదరాబాద్, డిసెంబర్ 30: తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని



డీజీపీ శివధర్ రెడ్డి గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో ఈ ఏడాది నేరాల సంఖ్య 2.33 శాతం తగ్గిందని వెల్లడించారు. వార్షిక నివేదిక-2025 విడుదల చేసిన సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ గతేడాది 2,34,158 కేసులు నమోదైతే.. 2025 సంవత్సరంలో 2.28,69 కేసులు నమోదయ్యాయని తెలిపారు. బీఎన్ఎస్ కేసులు 2024 లో 1,69,477 నమోదైతే 2025లో 1,67,018 కేసులు నమోదయ్యాయని, ఇవి గతేడాదితో పోలిస్తే 1.45శాతం తగ్గిందని తెలిపారు. నేర నిరూపణ శాతం 3.09 శాతం పెరిగిందని, ఇది గతేడాది 35.63 శాతం ఉంటే ఈ ఏడాది 38.72 శాతం ఉందని తెలిపారు. ఈ ఏడాది నాలుగు కేసుల్లో మరణశిక్ష విధించబడిందన్నారు. 216 కేసుల్లో 320 మందికి యావజ్జీవ శిక్ష పడిందని చెప్పారు.

పోక్సో చట్టం కింద నమోదైన మొత్తం 141 కేసుల్లో ఈ ఏడాది కింద నమోదైన మొత్తం 141 కేసుల్లో 154 మంది నిందితులకు జీవిత ఖైదు విధించబడిందని, 3 కేసుల్లో నిందితులకు మరణ శిక్ష పడిందంని తెలిపారు. ఎస్సీ ఎస్టీ చట్టం 28 కేసుల్లో 53 మంది నిందితులకు జీవిత ఖైతు విధించబడిందని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు, మిస్ వరల్డ్ పోటీలు, ఫుట్బాల్ ఆటగాడు మెస్సీ ప్రోగ్రామ్, వరదలు వంటి విపత్తులను ముఖ్యమైన ఈవెంట్లను తెలంగాణ పోలీస్ సమర్థవంతంగా నిర్వహించిందని చెప్పారు.

### ఈ ఏడాది 509 మంది మావోయిస్టుల లొంగుబాటు:

ఈ ఏడాది 509 మంది మావోయిస్టులు లొంగిపోయారని, అందులో 23మంది తెలంగాణకు చెందిన మావోయిస్టులు ఉన్నారని డీజీపీ వెల్లడించారు. సైబర్ క్రైమ్ విషయంలో రాష్ట్రంలో 3 శాతం తగ్గిందన్నారు. సైబర్ నేరాలు జాతీయ స్థాయిలో 41 శాతం పెరగగా తెలంగాణలో మాత్రం తగ్గాయన్నారు. ఫోన్ల రికవరీ విషయంలో దేశంలోనే తెలంగాణ (ఎవశ్రీజీనిణజీనిజీ) ముందు వరుసలో ఉందని, రోజుకు సగటున 111 ఫోట్లు రికవరీ అవుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హత్యలు 8.76 శాతం తగ్గాయని, అత్యాచారాలు 13.45 శాతం, దోపీడీలు 27, దొంగతనాలు 9.1 శాతం తగ్గాయని డీజీపీ తెలిపారు. నమ్మక ద్రోహం కేసులు 23 శాతం పెరిగాయని వెల్లడించారు. వరకట్నం కోసం మహిళల హత్యలు 2 శాతం తగ్గాయని మహిళా భద్రత కోసం షీ టీంలు యాక్టివ్ పని చేస్తున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులు 9.5 శాతం తగ్గగా సైబర్ క్రైమ్ కేసుల్లో రికవరీ 23 శాతం పెరిగిందని, ఈ ఏడాది రూ. 246 కోట్లు రికవరీ చేశామన్నారు. 24,498 మంది బాధితులకు రూ. 159.65 కోట్లు రిఫండ్ కూడా చేశామన్నారు.

### దేశంలో సత్తా చాటిన తెలంగాణ పోలీస్:

పోలీస్ శాఖలో కీలక పదవుల్లో మహిళా అధికారులు పనిచేస్తున్నారని చెప్పారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఈ ఏడాది వచ్చిన వరదలను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని గతంలో ఎప్పుడూ ఇలాంటి వరదలు నిజామాబాద్ లో రాలేదన్నారు. వరదల సమయంలో పోలీస్ సిబ్బంది బాగా పని చేసి ప్రాణనష్టం లేకుండా చూశాం న్నారు. రాష్ట్రంలో వివిధ కేసులను లోక్ అదాలత్ లో పెద్ద సంఖ్యలో పరిష్కరించామని చెప్పారు. డ్యూటీ మీట్ అండ్ స్పోర్ట్స్ ఈవెంట్లలో తెలంగాణ పోలీసులు తమ సత్తా చాటారని డీజీపీ వెల్ల డించారు. జార్ఖండ్ లో నిర్వహిం చిన 68వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ లో తెలంగాణ పోలీసులు 18 పతకాలతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. ప్రపంచ పోలీస్ ఫైర్ గేమ్స్ లో తెలంగాణ పోలీసులు 10 పతకాలు సాధించారాన్నారు.

# 2026 - ఆశావహ సంవత్సరానికి ఆహ్వానం !

భారతదేశ జనాభా నేడు 146 కోట్లు దాటింది. భారతీయుల సగటు వయస్సు 28.4 ఏండ్లు మాత్రమే ఉండడంతో మన దేశాన్ని “యువ భారత్” అంటూ సగర్వంగా పిలుస్తున్నాం. దేశ జనాభాలో 14 ఏండ్ల లోపు జనాభా 24%, 25 ఏండ్ల లోపు జనాభా 50%, 35 ఏండ్ల లోపు జనాభా 65% నమోదు అవుతున్నది. నేటి ఈ విచిత్ర పరిస్థితుల్లో ప్రపంచ యువత కేంద్రంగా భారత్ నిలుస్తున్నది. భారత్‌కు మాత్రమే స్వంతమైన యువశక్తిని క్రమ పద్దతిలో పెంచి పోషిస్తే రేపటి భారత భవిష్యత్తు ఉజ్వలంగా ఉండగలదని అంచనా వేస్తున్నారు. నేటి యువ భారతానికి నాణ్యమైన విద్య, సాంకేతిక నైపుణ్యాలు సమృద్ధిగా ఉన్న యువత తక్షణ అవసరంగా మారింది. మన యువతను సన్మార్గంలో నిలుపగలిగితే దేశ, విదేశాల్లో వారి అవసరం పెరిగి నిరుద్యోగం తగ్గడం, దేశం సమగ్రాభివృద్ధి దిశగా వడివడిగా అడుగులు వేయడం సుసాధ్యం అవుతుందని మరిచి పోరాదు.

ఆర్థిక అసమానతలు పెరుగుతున్న వేళ:

వాతావరణ మార్పులు కొనసాగుతున్న వేళ భారత ఆర్థిక గమనం మందగించడంతో పాటు ధనికుల సంపద పెరగడం, పేదలు నిరుపేదలుగా మారడం జరుగుతూ అసమానవతలు, ద్రవ్యోల్బణం క్రమంగా పెరుగుతున్న వేళ 2026 సంవత్సరం అయినా మన ఆర్థిక అనారోగ్యాలకు సరైన ఔషధ చికిత్సల పథకాలు అందించాలని కోరుకుంటున్నాం. ప్రభుత్వాల నగదు బదిలీ సంక్షేమ పంపకాలు క్రమంగా పెరగడంతో పాటు మధ్య తరగతి, సంపన్న వర్గాలపై పన్నుల పోటు పెరగడం కూడా కొంత కలవరపెడుతున్నది. వేతనాలు తగ్గడం, ఉద్యోగ ఉపాధులు సన్నగిల్లడంతో పేదలు నలిగి పోతున్నారు. రానున్న ఫిబ్రవరి-2026 కేంద్ర బడ్జెట్‌లోనైనా కొంత ఉపశమనం లభిస్తుందని పేదలు, సంపన్న వర్గాలు ఆశ పడుతున్నాయి. 2026లో తీసుకోవలసిన ఆర్థిక చర్యల్లో కొన్నింటిని గుర్తించి ప్రాధాన్యతాక్రమంలో సంక్షేమ, అభివృద్ధి రంగాలకు సమతుల్యత పాటిస్తూ ఆశావహ అడుగులు వేయాలని నిపుణులు కోరుతున్నారు.

ఉద్యోగ, ఉపాధుల కల్పన ఆధార సబ్సిడీ పథకాలు:

నేటి యువ భారతంలో ఉద్యోగ, ఉపాధుల కొరతతో యువశక్తి నిర్వీర్యం అవుతున్నదని, ప్రైవేటు రంగాలకు అందించే ఆర్థిక వెసులుబాటు లేదా సబ్సిడీలను ఉద్యోగ ఉపాధుల కల్పనకు లింక్ చేయడం ఒక మంచి ప్రయత్నం అవుతుంది. కార్మికవర్గ వేతనాలు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెరగక పోవడం, ధనిక మధ్య తరగతి వర్గాలు 30 శాతం వరకు పన్నులు చెల్లించవలసి రావడం ప్రధాన సమస్యలుగా గుర్తించారు. ఉత్పత్తి ఆధార సబ్సిడీల కల్పన సరైన పద్దతిలో సాగితే మాన్యుఫాక్చరింగ్ రంగాలు ఊపిరి పీల్చుకుంటాయి. అదే విధంగా ఉద్యోగ కల్పన ఆధార సబ్సిడీలతో కూడా నిరుద్యోగానికి సమాధానాలు దొరుకుతాయని విశ్లేషిస్తున్నారు. దేశంలో పాటు భారతీయుల భవితను దృష్టిలో పెట్టుకొని పెట్టుబడులు పెట్టడం సముచితంగా ఉంటుంది. మహిళా శక్తికి ఊతం ఇవ్వడం ఉద్యోగాల కల్పన, పన్నుల్లో రాయితీలు మరింత పెరగాలి.

నాణ్యమైన విద్యకు పెద్ద పీట వేయాలి:

యువశక్తి అపారంగా ఉన్న యువభారతంలో నైపుణ్య విద్యకు బడ్జెట్ కేటాయింపులు రెట్టింపు కావాలి. పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్య బోధనలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్య వికాసానికి సమానంగా, సమతుల్యత పాటిస్తూ అధిక నిధులు కేటాయించాలి. పేదలకు నాణ్యమైన నైపుణ్యాలతో కూడిన విద్య లభిస్తేనే రేపటి యువభారతం అభివృద్ధిలో భాగస్వామి అవుతుందని తెలుసుకోవాలి. సేవా రంగాలు బలపడడం, నాణ్యమైన విద్య అందించడం సమాంతరంగా కొనసాగాలి. పేద వర్గాలకు ప్రైవేటు రంగంలో నాణ్యమైన విద్యను అందించే పాఠశాలలకు రాయితీలు లేదా ప్రోత్సాహకాలు అందించడం మంచి ఫలితాలను ఇవ్వవచ్చు. ఉపాధ్యాయులకు కాలానుగుణంగా శిక్షణలు లేదా రిఫ్రెషర్ కోర్సులు నిర్వహించడం, ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడడం మరువరాదు. ఢిల్లీలో వెలసిన ప్రభుత్వం పాఠశాల విద్య సదుపాయాల పెంపులో తీసుకున్న చర్యలు మంచి ఫలితాలను ఇవ్వడమే కాకుండా రాజకీయంగా ఆప్ పార్టీకి లబ్ధిని చేకూరడం కూడా చూస్తున్నాం.

యువతలో నైపుణ్య వికాసానికి ప్రాధాన్యం:

విద్యకు సంబంధించిన పట్టాలు ఉండడం మాత్రమే ఉద్యోగ నియామకాలకు అర్హత కాదు. ఉన్నత విద్యతో పాటు నైపుణ్యాల పెంపుదలకు అధిక పెట్టుబడులు ఇవ్వడం నేటి డిజిటల్ యుగంలో కనీస అవసరం అవుతున్నది. నాణ్యమైన విద్య అందిస్తూనే నైపుణ్య వికాస శిక్షణలు సమాంతరంగా ఏకకాలంలో కొనసాగాలి. నైపుణ్య శిక్షణకు అవసరమైన కేంద్రాలను ప్రభుత్వాలు నెలకొల్పడం, పేద వర్గాల యువతకు నైపుణ్య విద్య అందించడం జరగాలి. ఉద్యోగ కల్పన ఆధార విద్యా సంస్థల స్థాపనకు ఊతం ఇవ్వాలి. మెడికల్ కాలేజీల్లో నర్సింగ్ కాలేజీలు, ఫార్మసిస్టులు/మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ కేంద్రాలు కొనసాగితే దేశ విదేశీ వైద్యరంగాల్లో ఉద్యోగ నియామకాలు పెరుగుతాయి. ప్లంబర్లు, ఎలక్ట్రిఫికేషన్, కార్పెంటరీ లాంటి రంగాల్లో యువతకు తగు శిక్షణ కేంద్రాల ద్వారా అవసర నైపుణ్య విద్యను కల్పించాలి.

నైపుణ్య వికసిక విద్య పూర్తి చేసిన భారతీయ యువతకు దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఇలా నిరుద్యోగం తగ్గితే దేశాభివృద్ధిలో యువశక్తి భాగస్వామ్యం పెరిగి అభివృద్ధి చెందిన దేశాల సరసన భారతం నిలుస్తుందని విశ్వసించాలి.

- ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# 140 కోట్ల మంది భారతీయులను ఉత్తేజపరిచిన నాయకుడి జీవితాన్ని ప్రదర్శించిన “నమోత్సవ్”: శ్రీ అమిత్ షా



న్యూఢిల్లీ, డిసెంబర్ 30: భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జీవితం, నాయకత్వం, దార్శనికతల ప్రస్థానాన్ని కీర్తిస్తూ ‘నమోత్సవ్’ పేరుతో నిర్వహించిన గొప్ప మ్యూజికల్ మల్టీమీడియా ప్రదర్శనతో నిన్న అహ్మదాబాద్ నగరంలో గర్వం, సంస్కృతి, స్ఫూర్తి కలగలసిన ఒక మరపురాని సాయంత్రం ఆవిష్కృతమైంది. సంస్కార్‌ధామ్ నిర్వహించిన ఈ మూడు రోజుల సాంస్కృతిక కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు. సేవ, శ్రమ, జాతి నిర్మాణంతో ముడిపడిన ఒక అసాధారణ ప్రస్థానాన్ని కళ్లకు కట్టేందుకు కళ, సంగీతం, సాంకేతికత, కథనం వంటి కళలను ఇది ఏకతాటిపైకి తెచ్చింది.

కేంద్ర హోం వ్యవహారాల, సహకార శాఖా మంత్రి శ్రీ అమిత్ షా ఈ ‘నమోత్సవ్’ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ అమిత్ షా మాట్లాడుతూ.... “నమోత్సవ్ కార్యక్రమం ఒక గొప్ప నాయకుని జీవితానికి ప్రతిబింబం. ఆ మహానేత కేవలం 11 సంవత్సరాల కాలం లోనే... 2047 నాటికి దేశాన్ని అన్ని రంగాల్లో ప్రపంచంలోనే నంబర్ వన్‌గా మార్చడానికి 140 కోట్ల మంది భారతీయులను ప్రేరేపించగలిగారు. ఒక వ్యక్తి తన జీవితాన్ని ఒక నిర్దిష్ట జాతీయ లక్ష్యానికి అంకితం చేసి... దాని సాధన కోసం నిరంతర ప్రయోగాలు చేస్తూ... ఆ లక్ష్యాన్ని సాకారం చేసే బాధ్యతను పంచుకునే ప్రజలందరితో దేశవ్యాప్తంగా ఒక పెద్ద బృందాన్ని తయారు చేస్తేనే ఇది సాధ్యమవుతుంది” అని శ్రీ అమిత్ షా అన్నారు.

నమోత్సవ్ కార్యక్రమం ఒక గొప్ప రంగస్థల ప్రదర్శన. ఇది గుజరాత్‌లోని వడ్‌నగర్ నుంచి ప్రారంభమై సాధారణ జీవితం నుంచి గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత భారత ప్రధానమంత్రిగా పరివర్తనాత్మక నాయకత్వం దాకా ఎదిగిన మన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్ఫూర్తిదాయక జీవితాన్ని కళాత్మకంగా చిత్రించింది. ప్రత్యక్ష ప్రదర్శనలు, సంగీతం, నృత్యం, కథనం, అత్యాధునిక మల్టీమీడియా దృశ్యాల సమ్మేళనంతో సాగిన ఈ కార్యక్రమం ఆయన వ్యక్తిగత ప్రయాణం, భారత అభివృద్ధి పథంలోని కీలక ఘట్టాలను అద్భుతంగా ప్రదర్శించింది.

ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సాంస్కృతిక సాధకులు, ఆధ్యాత్మిక నాయకులు, కళాకారులు, పండితులు సహా విభిన్న రంగాలకు చెందిన పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇది ఈ కార్యక్రమ విస్తృత ఆకర్షణను, ప్రాముఖ్యతను ప్రతిబింబించింది. అధిక సంఖ్యలో ప్రజల భాగస్వామ్యం సాంస్కృతిక వ్యక్తీకరణ, సామూహిక జాతీయ స్పృహల మధ్య బలమైన సంబంధాన్ని పునరుద్ఘాటించింది.

ఈ కార్యక్రమంలోని ముఖ్యాంశాల్లో ఒకటి... కళాకారుల అద్భుత లైవ్ ప్రదర్శన. విహంగ వీక్షణంలో ఈ దృశ్యం సంస్కృతి, సంగీతం, సందేశాల స్పష్టమైన సమ్మేళనాన్ని సామరస్యంగా ప్రదర్శిస్తూ... ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసే ప్రత్యేక దృశ్య అనుభవాన్ని అందించింది.

ఈ వేదికపై 150 మందికి పైగా కళాకారులు ప్రదర్శననిచ్చారు. వారి శక్తిమంతమైన ప్రదర్శనలు శ్రీ నరేంద్ర మోదీ జీవిత, నాయకత్వ ప్రయాణాన్ని కళ్ళకు కట్టాయి. అద్భుతంగా రూపొందించిన నాటికల ద్వారా... గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయన పదవీ కాలంలో చేపట్టిన చరిత్రాత్మక అభివృద్ధి కార్యక్రమాలను ఈ కార్యక్రమం ప్రదర్శించింది. గుజరాత్ అభివృద్ధి నమూనా, సుపరిపాలనలు తరువాతి కాలంలో దేశ పురోగతికి ఒక బ్లూప్రింట్‌గా పరిణామం చెందిన తీరును ఈ ప్రదర్శన చక్కగా వివరించింది.

మౌలిక సదుపాయాలు, పాలనా సంస్కరణలు, సామాజిక సాధికారత, సమ్మిళిత వృద్ధిలో కీలక విజయాలను ఈ కథనం ప్రదర్శించింది. పారదర్శకత, జవాబుదారితనం, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి విధానాలనూ స్పష్టం చేసింది. జాతీయ స్థాయిలో విధానాలు, పాలనా ప్రణాళికలను రూపొందించడంలో గుజరాత్‌లో వేసిన పునాదులు ఎలా కీలక పాత్ర పోషించాయో ఈ కార్యక్రమం ప్రస్ఫుటం చేసింది.

ఈ కార్యక్రమాల్లో భాగంగా సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తన పబ్లికేషన్స్ విభాగం ద్వారా, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), పీఐబీల ద్వారా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జీవితం, కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రచారం చేయడంలో చురుకైన పాత్ర పోషించింది. సీబీసీ, అహ్మదాబాద్‌లోని పబ్లికేషన్స్ విభాగం సిబ్బంది కార్యక్రమ వేదిక వద్ద ఒక ప్రత్యేక పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో ప్రధానమంత్రి ఆలోచనలు, నాయకత్వ తత్వం, ప్రజా సేవ ప్రయాణాన్ని చక్కగా వివరించే ప్రచురణలను ప్రదర్శించారు.

ఈ పుస్తక ప్రదర్శన... సందర్శకులు, పండితులు, విద్యార్థులు, సాధారణ ప్రేక్షకుల దృష్టిని గణనీయంగా ఆకర్షించింది. శ్రీ నరేంద్ర మోదీ జీవితం, కార్యకలాపాల వివిధ కోణాలను గురించి సమగ్ర సమాచారాన్ని అందించే దాదాపు 14 ప్రముఖ శీర్షికలను ఇక్కడ ప్రదర్శించారు. వీటిలో భావన సోమయ్య రాసిన లెటర్స్ టు మదర్, ఆంఖ్ ఆ ధన్యా చే, ది మోదీ స్టోరీ - రిఫ్లెక్షన్స్ ఆన్ లీడర్‌షిప్ అండ్ లైఫ్, మోడీఏ20-డ్రీమ్స్ మీట్ డెలివరీ, 370-అన్‌డూయింగ్ ది అన్‌జస్ట్, ఇగ్నైటింగ్ కలెక్టివ్ గుడ్‌నెస్ - మన్ కీ బాత్ ఏ100 సహా అనేక ఇతర ముఖ్యమైన ప్రచురణలూ ఉన్నాయి.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాల సంకలనాన్నీ పబ్లికేషన్స్ విభాగం ప్రదర్శించింది. ఇది పరిపాలన, అభివృద్ధి, సామాజిక సంస్కరణలు, అంతర్జాతీయ సంబంధాలపై ఆయన దార్శనికతను ప్రతిబింబించింది. ఈ సంకలనం సందర్శకులకు వివిధ జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రధానమంత్రి పంచుకున్న ఆలోచనలు, సందేశాలతో మరింతగా మమేకమయ్యే అవకాశాన్ని కల్పించింది.

ప్రసార భారతి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ గౌరవ్ ద్వివేది, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్ జనరల్ శ్రీ ధీరేంద్ర ఓజా, పీఐబీ అహ్మదాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీ ప్రశాంత్ పాత్రబే ఈ పుస్తక ప్రదర్శనను సందర్శించి అధికారులతో సంభాషించారు. ప్రధానమంత్రి ప్రజా సేవ ప్రయాణాన్ని, దేశ నిర్మాణంలో ఆయన కృషిని వివరించే ప్రామాణికమైన, సమాచారాత్మక సాహిత్యాన్ని రూపొందించి... ప్రదర్శించడంలో మంత్రిత్వ శాఖ ప్రయత్నాలను వారు ప్రశంసించారు. సమకాలీన చరిత్రను పరిరక్షించడంలో పుస్తకాలు, ప్రచురణల ప్రాముఖ్యతను స్పష్టం చేస్తూ... సమాచార వ్యాప్తి, ప్రజలకు సమాచారాన్ని చేరవేయడం కోసం సాంస్కృతిక వేదికలను ఉపయోగించుకునే ఆలోచన పట్ల వారు ప్రశంసలు కురిపించారు.

సాంస్కృతిక విలువలు, నాయకత్వం, సామాజిక పరివర్తనను తెలియజేసే ఒక మాధ్యమంగా నమోత్సవ్ కార్యక్రమం... సాంస్కృతిక ప్రదర్శనను ఉపయోగించుకునే తీరుకు ఒక శక్తిమంతమైన ఉదాహరణగా నిలిచింది. సాంప్రదాయ కళలను ఆధునిక సాంకేతికతతో మిళితం చేయడం ద్వారా... ఈ కార్యక్రమం అన్ని తరాలు, నేపథ్యాలకు చెందిన ప్రేక్షకులను ఆకర్షించడంలో విజయవంతమైంది.

ప్రదర్శన సందర్భంగా ప్రేక్షకులంతా సమర్థతతను, ఆవిష్కరణలను, ప్రజాసేవ స్ఫూర్తిని ప్రతిబింబించే అద్భుత సన్నివేశాలను ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. వినయం, అంకిత భావం, సమష్టి కృషి వంటి ఇతివృత్తాలను ఈ ప్రొడక్షన్ హైలైట్ చేసింది. ప్రజా-కేంద్రిత పాలనలో పరివర్తనాత్మక నాయకత్వం లోతుగా పాతుకుపోయిందనే ఆలోచననూ ఇది బలోపేతం చేసింది.

ఉన్నత కళాత్మక ప్రమాణాలను పాటిస్తూనే... సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా, అర్థవంతంగా ఉండేలా నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని చక్కగా రూపొందించారు. కచ్చితత్వం గల కొరియోగ్రఫీ, ఉత్తేజకరమైన సంగీతం, ఆకర్షణీయమైన కథనం, లీనమయ్యే దృశ్యాలు కలిసి శాశ్వత భావోద్వేగ ప్రభావాన్ని సృష్టించాయి.

నమోత్సవ్ కేవలం ఒక సాంస్కృతిక కార్యక్రమంగానే కాకుండా... భారత ప్రజాస్వామ్య ప్రస్థానానికి, అభివృద్ధి ఆకాంక్షలకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచింది. చరిత్రను మలచడంలో నాయకత్వ పాత్రను ఈ కార్యక్రమం స్పష్టం చేసింది. తరతరాలను ఉత్తేజపరిచేలా కథలను చెప్పడంలో సృజనాత్మక వ్యక్తీకరణకు గల శక్తిని ఇది పునరుద్ఘాటించింది.

## పురాతన భారతీయ ‘స్టిచ్డ్-షిప్’ పద్ధతిలో నిర్మించిన ఐఎన్ఎస్‌వీ కౌండిన్య పోర్‌బందర్ నుంచి ఒమన్‌లోని మస్కట్‌కు తొలి ప్రయాణాన్ని ప్రారంభించడంపై ప్రధానమంత్రి ప్రశంస

న్యూఢిల్లీ, డిసెంబర్ 29: ఐఎన్ఎస్‌వీ కౌండిన్య నౌకను అద్భుతంగా తీర్చిదిద్ది, ప్రాణం పోసిన రూపకర్తలు, కళాకారులు, నౌకా నిర్మాణ నిపుణులు, భారత నావికాదళం అంకితభావంతో చేసిన కృషిని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందించారు. ఈ నౌక గుజరాత్‌లోని పోర్‌బందర్ నుంచి ఒమన్‌లోని మస్కట్ వరకు తొలి ప్రయాణాన్ని ప్రారంభించిన సందర్భంగా ప్రశంసలు కురిపించారు. పురాతన భారతీయ ‘స్టిచ్డ్-షిప్’ సాంకేతికతతో నిర్మించిన ఐఎన్ఎస్‌వీ కౌండిన్య, భారతదేశపు సుసంపన్నమైన సముద్రయాన సంప్రదాయాలను ప్రతిబింబిస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ‘గల్ఫ్ ప్రాంతంతో, ఇతర దేశాలతో మనకున్న చారిత్రక సంబంధాలను పునరుద్ధరిస్తూ సాగుతున్న ఈ నౌకా సిబ్బందికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు. వారి ప్రయాణం సురక్షితంగా, ఎప్పటికీ గుర్తుండిపోయేలా సాగాలని కోరుకుంటున్నాను’ అని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

"ఐఎన్ఎస్‌వీ కౌండిన్య పోర్‌బందర్ నుంచి ఒమన్‌లోని మస్కట్‌కు తొలి ప్రయాణాన్ని ప్రారంభించటం అద్భుతం. పురాతన భారతీయ ‘స్టిచ్డ్-షిప్’ సాంకేతికతతో నిర్మితమైన ఈ నౌక, భారతదేశపు సుసంపన్నమైన సముద్రయాన సంప్రదాయాలను సగర్వంగా చాటిచెబుతోంది. ఈ విశిష్టమైన నౌకను అద్భుతంగా తీర్చిదిద్దిన రూపకర్తలు, కళాకారులు, నౌకా నిర్మాణ నిపుణులు, భారత నావికాదళ అంకితభావంతో కూడిన కృషిని నేను అభినందిస్తున్నాను. గల్ఫ్ ప్రాంతంతో, అంతకు మించి మనకున్న చారిత్రక సంబంధాలను పునరుద్ధరిస్తూ సాగుతున్న ఈ నౌకా సిబ్బందికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు. వారి ప్రయాణం సురక్షితంగా, ఎల్లప్పుడూ గుర్తుండిపోయేలా సాగాలని కోరుకుంటున్నాను"

# అంగన్వాడీ కేంద్రం పని తీరు పట్ల జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తీవ్ర అసంతృప్తి



కర్నూలు, సెంబర్ 30:దేవనకొండ మండలం మాచాపురం అంగన్వాడీ కేంద్రం పని తీరు పట్ల జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సక్రమంగా విధులు నిర్వహించకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. మంగళవారం దేవనకొండ మండలం మాచాపురం గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తూ అంగన్వాడీ కేంద్రంలో ఒకే ఒక్క చిన్నారి ఉండడంతో ఉదయం 9.30 గంటలు అవుతున్నప్పటికీ ఎందుకు పిల్లలు అంగన్వాడీ కేంద్రంలో లేరని కలెక్టర్ అంగన్వాడీ టీచర్ ను ప్రశ్నించారు.

అంగన్వాడీ కేంద్రంలో ఉన్న ఆ పాప ఏ, బి, సి, డీ లు కూడా చెప్పలేకపోవడంతో పిల్లలకు ఏమి పాఠాలు నేర్పిస్తున్నారని కలెక్టర్ అంగన్వాడీ టీచర్ ను ప్రశ్నించారు. స్టాక్ రిజిస్టర్ నిర్వహించకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పని తీరు మార్చుకోవాలని, సక్రమంగా విధులు నిర్వహించని అంగన్వాడీ సిబ్బంది పై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. బాత్రూమ్ లను యాసిడ్ తో శుభ్రం చేయించాలని కలెక్టర్ ఆదేశించారు.

అనంతరం అక్కడే ఉన్న గ్రామస్థులతో కలెక్టర్ మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా.. పెన్షన్ ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారా.. పెన్షన్ ఇచ్చే సమయంలో డబ్బులు వసూలు చేస్తున్నారా... ప్రతి రోజు పారిశుధ్య సిబ్బంది ఇంటి వద్దకి వచ్చి చెత్త సేకరణ చేస్తున్నారా... అని గ్రామస్థులను ఆరా తీశారు. పెన్షన్ ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారని.. పెన్షన్ ఇచ్చే సమయంలో డబ్బులు వసూలు చేయడం లేదని.. ప్రతి రోజు పారిశుధ్య సిబ్బంది ఇంటి వద్దకి వచ్చి చెత్త సేకరిస్తున్నారని.. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని గ్రామస్తులు కలెక్టర్ కి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి విజయ, సిడిపిఓ సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ జీఎస్టీ బిల్లుల ముఠాలపై ఉక్కుపాదం..

## -ఐదు కోట్లకు మించిన మోసాలపై క్రిమినల్ కేసులు..
## -జిల్లా ఎస్పీల ద్వారా కలెక్టర్లకు ఫిర్యాదులు..

చిత్తూరు, డిసెంబర్ 30: నకిలీ జీఎస్టీ బిల్లుల ద్వారా ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టిన కేటుగాళ్ల పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జీఎస్టీ ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐదు కోట్ల రూపాయలకు మించి జీఎస్టీ మోసాలకు పాల్పడిన వ్యక్తులు, సంస్థల పై కేసులు నమోదు చేసి అరెస్టులు చేయించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలకు అధికారిక ఫిర్యాదులు అందజేయనున్నారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న జీఎస్టీ చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జాయింట్ కమిషనర్లకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

అందులో భాగంగా జాయింట్ కమిషనర్లు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా అసిస్టెంట్ కమిషనర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రతి జిల్లాలో నకిలీ బిల్లుల ద్వారా జరిగిన జీఎస్టీ మోసాల పై సమగ్ర విచారణ చేపట్టి, మోసానికి పాల్పడిన సంస్థలు, వ్యక్తులు, మధ్యవర్తులు, లాభదారుల పూర్తి వివరాలతో కేసు డాక్యుమెంటేషన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. చిత్తూరు జీఎస్టీ పరిధిలో జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్ రెడ్డి సోమవారం తన పరిధిలోని తొమ్మిది మంది అసిస్టెంట్ కమిషనర్లతో జూమ్ సమావేశం నిర్వహించారు. చిత్తూరు, పలమనేరు, తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీ సిటీ, గూడూరు తదితర ప్రాంతాల్లో జరిగిన జీఎస్టీ మోసాల పై లోతైన సమాచారాన్ని సేకరించాలని, బోగస్ బిల్లులు, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, కాగితాల పై మాత్రమే ఉన్న సంస్థల వివరాలను వెలికితీయాలని ఆదేశించారు.

అసిస్టెంట్ కమిషనర్లు తమ పరిధిలో గతంలో జరిగిన జీఎస్టీ రిఫండ్‌లు, అనుమానాస్పద లావాదేవీలు, అసలు వ్యాపారం లేకుండానే కోట్ల రూపాయల టర్నోవర్ చూపిన సంస్థలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రాథమిక దర్యాప్తులోనే పలు షెల్ కంపెనీలు, నకిలీ చిరునామాలు, బోగస్ బ్యాంక్ ఖాతాలు బయటపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ వివరాలతో సమగ్ర ఫిర్యాదులు తయారు చేసి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు అందజేయాలని ఆదేశాలు ఉన్నాయి. వాటి ఆధారంగా పోలీసు శాఖ క్రిమినల్ కేసులు నమోదు చేసి, అరెస్టు వారెంట్లు జారీ చేసే ప్రక్రియ ప్రారంభం కానుంది. అవసరమైతే ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి, మోసగాళ్ల ఆస్తులను జప్తు దిశగా కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

కేవలం కేటుగాళ్లపైనే కాదు, వారికి సహకరించిన అధికారుల పాత్ర పై కూడా విచారణ జరిపేందుకు జీఎస్టీ ఉన్నతాధికారులు సమాయత్తమవుతున్నట్లు సమాచారం. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, ప్రత్యక్ష సహకారం అందించినట్లు తేలితే శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసే అవకాశముంది. బోగస్ బిల్లులతో ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టిన ముఠాలకు ఇక బేడీలు తప్పవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ చర్యలతో రాష్ట్రవ్యాప్తంగా జీఎస్టీ మోసాల పై గట్టి సందేశం వెళ్లనుందని, నిజాయితీగా పన్నులు చెల్లించే వ్యాపారులకు ఇది రక్షణగా మారుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# ఎరువుల పంపిణీలో అలసత్వం వద్దు

## -యూరియాను ఒకే దగ్గర నిలువ చేయడంపై కలెక్టర్ ఆగ్రహం
## -నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



నాగర్ కర్నూల్, డిసెంబర్ 30: ఎరువుల పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రం, యూరియా లభ్యత, సరఫరాను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ రైతుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, సరఫరాలో జాప్యం చేయకుండా చూడాలని, ఎక్కడ యూరియా సమస్య తలెత్తకుండా, ఎరువుల క్రయ విక్రయాలకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా నిలువలననమోదు చేయాలని, రైతులకు అవసరమైన యూరియా సరఫరాను అందించేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికలు ఏర్పాటు చేసి పకడ్బందీ చర్యలు చేపట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

పెద్దకొత్తపల్లి వ్యవసాయ కేంద్రంలో యూరియాను ఒకే దగ్గర డంపు చేయడంపై సంబంధిత అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రస్తుత నిల్వలపై పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని, హోల్ సేల్, రిటైల్ డీలర్లు, సహకార సంఘాల గోదాములలో రోజువారి యూరియా స్టాక్ ను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ జిల్లా స్థాయిలో సమన్వయం చేసుకొని మండలాల్లో గ్రామాల వారీగా అవసరానికి అనుగుణంగా కేటాయింపు చేయాలని సూచించారు. అధిక ధరలకు విక్రయించే లేదా ఇతర ఉత్పత్తులతో ప్రైవేట్ డీలర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి, అలాంటి వారి పై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

పారిశ్రామిక అవసరాలకు సబ్సిడీ యూరియా మళ్లించే అవకాశమున్న యూనిట్లపై తనిఖీలు చేసి, వారి ఉత్పత్తి గణాంకాలు, బిల్లులు సరిపోల్చి ఏమైనా పెద్ద వ్యత్యాసం ఉంటే డీలర్ అండ్ యూనిట్‌పై కేసులు నమోదు చేయాలన్నారు. యూరియా వినియోగాన్ని సమీక్షించేందుకు రోజువారీగా రైతుల యూరియా కొనుగోలుకు ప్రాధాన్యత అనుగుణంగా, కొనుగోలుదారులు, తరచుగా కొనేవారు, అధికంగా అమ్మిన రిటైలర్ల వివరాలను తనిఖీ చేయాలని మండల వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట పెద్దకొత్తపల్లి తాహసీల్దార్ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి వ్యవసాయ అధికారులు తదితరులున్నారు.

# నేర నియంత్రణలో మార్పు

కర్నూలు డిసెంబర్ 30: కర్నూలు జిల్లా వ్యాప్తంగా 2024?2025 సంవత్సరాల నేర గణాంకాలను పోల్చి పరిశీలిస్తే మొత్తం నేరాల సంఖ్యలో స్వల్ప పెరుగుదల కనిపించినప్పటికీ తీవ్రమైన నేరాలు, మహిళలపై నేరాలు, సైబర్ నేరాలు హత్యలు వంటి కీలక విభాగాల్లో గణనీయమైన తగ్గుదల నమోదైనట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల వెల్లడించారు.

ఈ రోజు స్థానిక కేస్ వ్యాస్ ఆడిటోరియంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమర్థవంతమైన పోలీసింగ్, సాంకేతిక వినియోగం, ప్రజల భాగస్వామ్యంతో నేర నియంత్రణలో స్పష్టమైన మార్పు కనిపిస్తున్నదని అధికారులు పేర్కొన్నారు.

2024 సంవత్సరంలో జిల్లాలో మొత్తం 4022 కేసులు నమోదు కాగా, 2025 సంవత్సరంలో 4051 కేసులు నమోదయ్యాయి. దీనివల్ల మొత్తం నేరాల్లో 0.7 శాతం స్వల్ప పెరుగుదల కనిపించింది. అయితే ఈ పెరుగుదల ప్రధానంగా చిన్నపాటి కేసుల కారణంగా ఉండగా, తీవ్రమైన నేరాల్లో తగ్గుదల కనిపించడం గమనార్హం.

# శ్రీ కొండాలమ్మ దీవెనలతో శుభాలు కలగాలి

## -గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము
## -శ్రీ కొండలమ్మ అమ్మవారి 2026 నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరించిన.. ఎమ్మెల్యే రాము



గుడివాడ,డిసెంబర్ 30: శ్రీ కొండలమ్మ వారి కరుణాకటాక్షాలతో కొత్త సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు కలగాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. ప్రసిద్ధిగాంచిన గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలోని శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థాన 2026 నూతన సంవత్సర క్యాలెండర్లను గుడివాడ ప్రజా వేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇవాళ ఆవిష్కరించారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే రాము కూటమి నాయకులకు వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందించి అమ్మవారి కంకణాలు కట్టి ప్రసాదం అందించారు. అమ్మవారి ఆశీస్సులతో గడిచిన ఏడాది కాలంలో గుడివాడ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నామని ఎమ్మెల్యే రాము అన్నారు. కొత్త సంవత్సరంలో కూడా గుడివాడ అభివృద్ధి పనులు అమ్మవారి దీవెనలతో దిగ్విజయంగా జరగాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వర రావు, శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం కమిటీ చైర్మన్ ఈడే మోహన్, ఆలయ ఈ.వో ఆకుల కొండలరావు, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహన్రావు, పంద్రాజు సాంబశివరావు, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, రామిదేని వేణు, పెద్దూ వీరభద్రరావు, యార్లగడ్డ సుధారాణి, సింగవరపు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుని వైద్యానికి వెస్సో సహాయం

హైదరాబాద్ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పెదపల్లి జిల్లా, గోదావరిఖని నివాసి బొజ్జ భాస్కర్ గత రెండు సంవత్సరాలుగా గొంతు క్యాన్సర్ తో బాధపడుతున్నారు. అంతేకాకుండా తదుపరి వచ్చిన క్షయవ్యాధి కూడా ఆయనను మరింత బలహీన పరిచింది. దీర్ఘకాల అనారోగ్యం కారణంగా సింగరేణి కాలరీస్‌లో చేస్తున్న చిన్నపాటి ఉద్యోగాన్ని కూడా ఆయన కోల్పోయారు. ప్రస్తుతం ఆయనకు నెలకు కేవలం రూ. 2,000/- ప్రభుత్వ పెన్షన్ మాత్రమే ఆదాయంగా ఉంది, ఇది కుటుంబ అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు.ప్రస్తుతం భాస్కర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అనారోగ్యం తీవ్రమై ఆహారం మింగలేని పరిస్థితికి చేరుకున్నారు. ద్రవ ఆహారంతోనే జీవిస్తున్నారు. ఇప్పటి వరకు కొంతమంది బంధువులు ఆర్థికంగా సహాయం చేసినప్పటికీ, మందుల ఖర్చులు మరియు వైద్య వ్యయాలకు ఆ సహాయం సరిపోవడం లేదు. ఈ పరిస్థితుల్లో స్థానిక సామాజిక సేవకులు వంగల పున్నం బాబు ద్వారా వెస్సో ట్రస్ట్ గురించి తెలుసుకొని, తన చికిత్స కొరకు ఆర్థిక సహాయం అందించవలసినదిగా ట్రస్ట్ ను ఆశ్రయించారు. వెస్సో ట్రస్టీలు స్పందించి గౌరవ దాతల సహకారంతో భాస్కర్ కు 45,200 రూపాయలు అందజేశారు.

# పదో తరగతి విద్యార్థి చరణ్ మృతి

## -తల్లిదండ్రుల గుండెలు పగిలే విషాదం

అమరావతి, డిసెంబర్ 30:శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువు మండలం మిర్జాపురం గ్రామానికి చెందిన ఎస్టీ వర్గానికి చెందిన హనుమంతుసాయమ్మ దంపతుల కుమారుడు, తలమర్ల ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి చరణ్ (15) ఇవాళ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందడం తీవ్ర విషాదాన్ని నింపింది.

సమీపంలో బహిర్భూమికి వెళ్లిన చరణ్ అక్కడే ఉన్న బావిలో పడిపోవడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. విషయం తెలిసిన వెంటనే పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్థానిక పోలీసులకు, ప్రభుత్వ అధికారులకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మోటార్ల సహాయంతో పోలీసులు బావిలో నుంచి చరణ్ మృతదేహాన్ని బయటకు తీశారు.

విద్యార్థి చరణ్ అంత్యక్రియలకు ఇవాళ హాజరైన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చరణ్ భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చదువుకునే వయసులోనే విద్యార్థి మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర విషాదంలో కన్నీటి పర్యంతమైన తల్లిదండ్రులు హనుమంతు, సాయమ్మలను ఎమ్మెల్యే ఓదార్చారు. "దేవుడు కడుపుకోత మిగిల్చాడు" అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ కుటుంబానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తచెరువు మండల టీడీపీ కన్వీనర్, వడ్డెర్ల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, తలమర్ల సింగిల్ విండో అధ్యక్షులు గోపాల్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు సాలక్క శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి, సూరి తదితర కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

# సమన్వయంతో అభివృద్ధికి కృషి.. సన్మాన కార్యక్రమంలో కాసిపేట మండల సర్పంచులు

ఆదిలాబాద్, డిసెంబర్ 30:మంచిర్యాల జిల్లా కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కాసిపేట మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్పంచులకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. కాసీపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచులను శాలువాలతో సత్కరించారు. ముందుగా ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ సునీల్ కుమార్ దేశ్ పాండే, ఎంపీవో శేఖ్ సప్టర్ ఆలీలు సర్పంచులకు సంబంధించి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

అనంతరం సర్పంచులకు సన్మానం చేశారు. సర్పంచులు కొండాపూర్ ఒల్లెపు శైలజ, కోనూర్ పీఠం మల్లేష్, పల్లంగూడ దుస్స విజయ, తాటిగూడ మడావి వెంకటేష్, మద్దిమాడ ఆడె దివ్య, కాసిపేట బదావత్ నీలా, ముత్యంపల్లి చాకటి సుగుణ, లంబాడితండా (కే) బోడ బలరాం, దేవాపూర్ సిడం రాందాస్, పెద్దనపల్లి కల్వల శరత్, కోమటిచేను జాడి మాణిక్య, చిన్న ధర్మారం భూక్య స్వప్న, బుగ్గగూడెం నవనందుల పుష్పలత, వెంకటాపూర్ పెంద్రం శంకర్, గట్రావ్ పల్లి ఆత్రం జంగు బాయి, సోనాపూర్ ఆర్క మహేందర్, లంబాడితండా(డీ) బానోత్ సహస్ర, ధర్మారావుపేట జుగునాక రాధ, మల్కెపల్లి కోట్నాక రఘు, రొట్టెపల్లి ఆత్రం కళావతి, సోమగూడెం(కే) కుస్నోత్ చైతన్యలను సన్మానించారు.

అధికారులు, సర్పంచులు సమన్వయంతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తామని అధికారులు, సర్పంచులు పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్ సప్టర్ అలీకి సర్పంచులు, కార్యదర్శులు శాలవాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ సునీల్ కుమార్ దేశ్ పాండే, ఎంపీవో శేఖ్ సప్టర్ అలీ, సూపరిడెండింట్ లక్ష్మయ్య, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మి నారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, ఏవో చల్ల ప్రభాకర్, పీఆర్ ఏఈ జగన్, ఏపీఎం రాజ్కుమార్, ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేయూ ఎదుట కార్మికుల ధర్నా

హనుమకొండ, డిసెంబర్ 30 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ ఎదుట కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ వర్కర్స్‌యూనియన్ సిఐటియు కేయూ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆల్ యూనివర్సిటీస్ ఉపాధ్యక్షుడు పుల్లా శ్రీనివాస్, యూనివర్సిటీస్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి మాట్లాడుతూ.. విద్యుత్ సవరణ చట్టం 2025ను, విత్తన సవరణ చట్టం, విబిజీ రాంజీ స్కీమును రద్దు చేయాలని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలని లేకపోతే పెద్దఎత్తున ఉద్యోగ, కార్మికవర్గం ఉద్యమిస్తుందని వారు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా జనవరి 19న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో ప్రదర్శనలు, బహిరంగ సభలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రామచందర్, దేశిని రవికుమార్, ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి, ఎర్రెల్లి శోభన్, భూక్య కిషన్, పల్లం రాజు, శోభ, నవీన్, మధు, రణధీర్, రాజేందర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్ పినాక తొలి ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన డీఆర్‌డీవో



న్యూఢిల్లీ, డిసెంబర్ 30:చాందీపూర్లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి 2025 డిసెంబర్ 29న దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్ (ఎల్ఆర్‌జీఆర్ 120) పినాకను విజయవంతంగా పరీక్షించారు. నిర్దేశించిన అన్ని వైమానిక విన్యాసాలను ప్రదర్శించేలా ఈ రాకెట్‌ను దాని గరిష్ఠ పరిధి అయిన 120 కి.మీ. వరకు పరీక్షించారు. అత్యంత కచ్చితత్వంతో ఎల్ఆర్‌జీఆర్ లక్ష్యాన్ని ఛేదించింది.

పరీక్షించేందుకు ఉపయోగించిన అన్ని పరికరాలు.. రాకెట్ ప్రయాణ మార్గాన్ని పూర్తిగా ట్రాక్ చేశాయి. ఈ రాకెట్‌ను హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ ల్యాబరేటరీ సహకారంతో ఆర్మమెంట్ రీసెర్చ్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్మెంట్ రూపొందించింది. దీనికి డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్మెంట్ ల్యాబరేటరీ, రీసెర్చ్ సెంటర్ ఇమారత్ తోడ్పాటు అందించాయి.

ఐటీఆర్, ప్రూఫ్ అండ్ ఎక్సపరిమెంటల్ ఎస్టాబ్లిష్మెంట్ ఈ ప్రయోగాన్ని సమన్వయం చేశాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న పినాక లాంచర్ నుంచి ఎల్ఆర్‌జీఆర్‌ను ప్రయోగించారు. ఒకే లాంచర్ నుంచి వివిధ శ్రేణులకు చెందిన పినాక రాకెట్లను ప్రయోగించగలిగే సామర్థ్యాన్ని ఇది ప్రదర్శిస్తుంది.

ఈ విజయం సాధించిన డీఆర్‌డీవోను రక్షణ మంత్రి శ్రీ రాజ్ నాథ్ సింగ్ అభినందించారు. దీర్ఘ శ్రేణి గైడెడ్ క్షిపణులను రూపొందించి విజయవంతంగా అభివృద్ధి చేయడం సాయుధ దళాల సామర్థ్యాలను పెంపొందిస్తుందని తెలిపారు. దీనిని మార్పును తీసుకొచ్చే చర్యగా అభివర్ణించారు.

రక్షణ పరిశోధనాభివృద్ధి విభాగం కార్యదర్శి, డీఆర్‌డీవో ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ ఈ ప్రయోగాన్ని వీక్షించారు. మిషన్ లక్ష్యాలను సాధించిన అన్ని బృందాలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పోకల రంజన్ 'కార్టూన్ల హాస్య చిత్రమాలిక' సంపుటి ఆవిష్కరణ



హైదరాబాద్ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రముఖ కార్పొరేట్ చిత్రకారులు దివంగత జ్ఞాన రంజన్ సృజనాత్మకత చిత్రాలు కార్టూన్ల సంపుటి 'హాస్య చిత్రమాలిక'గ్రంధావిష్కరణ హైదరాబాద్ సనత్ నగర్ లో ఘనంగా సోమవారం జరిగింది. ప్రముఖ రచయిత డాక్టర్ మాదిరెడ్డి అహోబల రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ సంఘ సేవకులు ఎం రాఘవరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి హాస్య చిత్రమాలిక పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. బాబు గారిలా నిరాడంబరంగా తన వితాలను చేసుకుంటూ అద్భుతమైన హాస్య ,వ్యంగ్య రేఖాచితాలను ప్రకృతి దృశ్యాలను అందించారని అవి నాటి ప్రముఖ పత్రికలలో ప్రచురితమైనాయని వారి ప్రతిభ అభినందనీ యమన్నారు. డాక్టర్ మాదిరెడ్డి అహోబలరావ్ మాట్లాడుతూ రంజన్ గొప్ప రాజకీయ చిత్రాలను గీసి అబ్బురపరిచారని ఆయన కీర్తిశేషులు అయిన ఏడాదికి ఈ పుస్తకం వెలువరించిన వారి కుటుంబ సభ్యులు ధన్యులని అన్నారు. ఈ కార్యక్రమంలో రంజన్ ధర్మపత్ని జయశ్రీ కుమారులు సుమంత్ కుమార్, శ్రీకాంత్ తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు,ఈ సందర్భంగా కవి రఘు శ్రీ వారిని సత్కరించారు.

# మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌కు సన్మానం



నల్గొండ, డిసెంబర్ 30: నల్లగొండ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సయ్యద్ ముసాబ్ అహ్మద్‌కు గ్రేడ్-1 కమిషనర్‌గా పదోన్నతి రావడంతో మంగళవారం మున్సిపల్ పలు విభాగాల సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపి భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. నల్లగొండ పట్టణంలో పారిశుధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ దేశస్థాయిలో నల్లగొండ మున్సిపాలిటీకి అవార్డు తీసుకొచ్చారన్నారు. అంతేకాకుండా అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా ఎక్కడా రాజీ లేకుండా తనవంతు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ రాములు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గడ్డం శ్రీనివాస్, నంద్యాల ప్రదీప్‌రెడ్డి, డీఈ అశోక్, ఏఈ దిలీప్ బార్గవ్, పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# సోయాబీన్ పంటను కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన.. నిలిచిన పత్తి కొనుగోళ్లు



ఆదిలాబాద్, డిసెంబర్ 30:ఆదిలాబాద్ జిల్లాలో సోయాబీన్ రైతుల ఆందోళనలు రోజు రోజుకు ఉధృతం అవుతున్నాయి. తాజాగా సోయాబీన్ పంటను కొనుగోలు చేయాలంటూ ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్ నుండి రైతుల ఆందోళన చేపట్టారు. మార్కెట్ యార్డ్ గేటు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. పత్తి వాహనాలు మార్కెట్ యార్డులోనికి వెళ్లకుండా రైతులు అడ్డుకున్నారు. రైతుల ఆందోళనతో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి.

కాగా, ప్రభుత్వ తీరుకు నిరసనగా నిన్న జిల్లా బేల మార్కెట్ యార్డులో మోకాళ్లపై కూర్చొని రైతులు వినూత్న నిరసన చేపట్టారు. 15 రోజులుగా పంట అమ్మడానికి రైతులు పడిగాపులు కాయంగా.. మార్క్ ఫెడ్ అధికారులు ఇటీవల కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన పంటను అధికారులు నా పేఫ్ గోదాములకు తరలించగా అక్కడ అధికారులు పంటను తిరస్కరించారు. దీంతో రైతులు తమ పంటను తిరిగి ఇంటికి తీసుకెళ్లారు.ప్రభుత్వం నామమాత్రంగా కొనుగోళ్లు చేస్తుందని, నిబంధనల పేరుతో రైతులను వేధింపుల కు గురిచేస్తుందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోయాబీన్ పంటను కొనుగోలు చేయాలంటూ ఆందోళనలు చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం ఫలితంగా రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు పంటను విక్రయించి నష్ట పోవాల్సి వస్తుందని అన్నారు. యాసంగి పెట్టుబడుల కోసం తాము ప్రైవేట్ వ్యాపారులకు పంటను విక్రయిస్తున్నట్లు రైతులు తెలిపారు.

## చొరబాట్లతో బెంగాల్ ప్రజల్లో ఆందోళన.. మమతా ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన అమిత్ షా

పశ్చిమ బెంగాల్, డిసెంబర్ 30:లోని మమతా బెనర్జీ నేతృత్వం లోని తృణమూల్ ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిప్పులు చెరిగారు. ప్రభుత్వం అవినీతి, భయం, చొరబాట్లతో బెంగాల్ నిండిపోయిందని.. ఇది రాష్ట్ర భద్రతకు తీవ్ర ముప్పు కలిగిస్తోందని ఆరోపించారు.

కోల్‌కతా లో విలేకరుల సమావేశంలో షా మాట్లాడుతూ.. 15 ఏండ్ల తృణమూల్ పాలన వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. 'గత 15 ఏండ్లుగా బెంగాల్ భయం, అవినీతి, దుష్పరిపాలనను చూసింది. చొరబాట్లు ప్రజల్లో అభద్రతా భావాన్ని, ఆందోళనను సృష్టించాయి. మహిళలకు రక్షణ లేకుండా పోయింది' అని షా వ్యాఖ్యానించారు.

దీదీ నేతృత్వంలోని ప్రభుత్వ అవినీతి కారణంగా రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఆ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బెంగాల్‌కు తిరిగి పూర్వవైభవం తెస్తామని.. స్వామి వివేకానంద, బంకిం చంద్ర చటోపాధ్యాయ, గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్, శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఊహించిన బెంగాల్‌ను నిర్మించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి పర్యావరణాన్ని కాపాడుదాం

**– రాజన్న సిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్**




రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30:నేటినిజం (ప్రతినిధి): దక్షిణ కాశీగా పేరు గాంచిన వేములవాడలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగంపై రాజన్న సిరిసిల్లా జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

మంగళవారం భీమేశ్వర సదన్‌లో ఫిబ్రవరి 15న జరిగే మహాశివరాత్రి జాతర సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పీ మహేష్ బిగితేలతో కలెక్టర్‌తో కలిసి అధికారుల సమన్వయ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా గరిమా అగర్వాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే భక్తులు ప్రతి చిన్న అవసరాలకు ప్లాస్టిక్ వాడడం ద్వారా విక్రయాలు భారీగా పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వేములవాడ పుణ్యక్షేత్ర పట్టణంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వస్తువులు దర్శనమిస్తున్నాయని తద్వారా పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా రాజన్న క్షేత్రంలో కోడెమొక్కు ఎంతో పవిత్రంగా భక్తులు భావిస్తున్నారని, వేములవాడ రాజన్న క్షేత్రంలో ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు పకడ్బందీగా పని చేయాలని అధికారులకు సూచించారు. ప్లాస్టిక్‌ను నియంత్రించి రాజన్న కోడెలను, పశువులను రక్షించుకుందాం అని ఆమె అన్నారు.

# సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకుందాం

**-వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్.**




హన్మకొండ, డిసంబర్ 30:(నేటినిజం ప్రతినిధి)సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలు ప్రశాంతవంతమైన వాతవరణంలో ఎలాంటి ఆవాంనీయ సంఘటనలు జరగకుండా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోనేందుకు పలుసూచనలు చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం ప్రకటన విడుదల చేసారు.

డిసెంబర్ 31 రాత్రి నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో స్థానిక పోలీసులతో పాటు ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, క్రైమ్, షీ టీమ్స్‌తో పాటు పెట్రోలింగ్ విభాగాలకు చెందిన పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారు. ముఖ్యంగా ఈ వేడుకలను ప్రజలు అర్ధరాత్రి 12.30 గంటల లోపు ముగించుకోవాల్సి వుంటుందని. ఈ నూతన సంవత్సర వేడుకుల సందర్భంగా ఎర్పాటు చేసే సంస్కృతిక కార్యక్రమాలకు నిర్వహకులు తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తూ అనుమతులు తీసుకోవడంతో పాటు, వేడుకలు నిర్వహించుకునే ప్రాంతంలో ఎలాంటి అశ్లీల నృత్యాలకు అనుమతి లేదని. అలాగే కార్యక్రమాల నిర్వహణ ప్రదేశంలో తప్పనిసరిగా సిసి కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు సెక్యూరిటీ సిబ్బంది ఎర్పాటు చేసుకోవాల్సి వుంటుందని. ఈ వేడుకలు జరిగే సమయంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఇండ్లవారికి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని, వేడుకల్లో ఎలాంటి మత్తు పదార్థాల వినియోగించడం లాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని. ప్రధానంగా ఈ వేడుకల వేళ యువకలు మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు చిక్కితే జరిమానతో పాటు జైలు శిక్ష విధించబడుతుందని. అలాగే వేగంగా వాహనాలు నడపడం, రోడ్లపై వెళ్ళేవారిని ఇబ్బందికి గురిచేసే వ్యవహరిస్తే సదరు వాహనదారులకు చట్టపరమైన తిప్పలు తప్పవని, రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు రాకుండా ట్రాఫిక్ సిబ్బందితో పాటు స్థానిక పోలీసుల అధ్వర్యంలో ట్రై సిటితో పాటు, గ్రామీణా ప్రాంతాల్లోను ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతాయని. అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకోబడుతుందని. పై అంక్షలను ఎవరైన అతిక్రమించిన, ఉల్లంఘించినట్లుగా ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 నంబర్‌కు సమాచారం అందించడం ద్వారా తక్షణమే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని, ఈ వేడుకలను ప్రజలు, యువత తమ ఇండ్లలోనే తమ కుటుంబ సభ్యులతో కల్సి సంతోషకరమైన వాతరణంలో నిర్వహించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

# ర్యాంకులు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి : వి.వి.లక్ష్మీనారాయణ




నల్గొండ, డిసెంబర్ 30: ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు ఇంటర్మీడియట్ కోర్సు కీలకమని, ఆ సమయంలో విద్యార్థులు పట్టుదలతో చదివి ర్యాంకులు సాధించి వారి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని ఆర్ ఎస్ వీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఎన్ ఆర్ ఎస్ ఐ ఐ టీ ఢ మెడికల్ అకాడమీ 3వ వార్షికోత్సవ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోదాడ వంటి పట్టణ ప్రాంతాల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందించి, వారిని జాతీయ స్థాయి ర్యాంకర్లుగా తయారు చేస్తున్న ఎన్ ఆర్ ఎస్ అకాడమీ కృషి అభినందనీయమన్నారు. ప్రతిభ ఉన్నప్పటికీ రూరల్ ప్రాంత విద్యార్థులు సరైన ఫౌండేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్ లేక ఇంటర్మీడియట్ లో రాణించలేక పోతున్నారన్నారు. దీనిని అధిగమించేందుకు వచ్చే విద్యా సంవత్సరంలో ఎన్ ఆర్ ఎస్ ఫౌండేషన్ స్కూల్ స్థాపించడం హర్షణీయమన్నారు.

అకాడమీ చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన తాను సరైన ఫౌండేషన్ లేక పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు ఈ అకాడమీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా పాఠశాలను కూడా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, అకాడమీ అడ్వైజరీ చైర్మన్ రవిశంకర్ రెడ్డి, డైరెక్టర్ మనోహర్ రెడ్డి, అకాడమీ కరస్పాండెంట్ వేణుగోపాల్ రావు, అకడమిక్ అడ్వైజర్ మైనం రామయ్య, ప్రిన్సిపాల్ గంధం వెంకటరమణ (జీవీ), వైస్ ప్రిన్సిపాల్ పి.నాగేశ్వర్‌రావు(పీఎన్ఆర్), ఏఓ మౌనిక, పీఆర్ఓ మల్లికార్జున్ పాల్గొన్నారు.

## ఎస్సీ బాలికల గురుకులంలో విద్యార్థినిని విచక్షణారహితంగా కొట్టిన వార్డెన్‌పై వేటు

భూపాలపల్లి డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );భూపాలపల్లి ఎస్సీ బాలికల గురుకులంలో విద్యార్థినిని విచక్షణారహితంగా కొట్టిన వార్డెన్‌పై వేటుపడింది. డిగ్రీ విద్యార్థినిని చితకబాదిన వార్డెన్ భవానీని కలెక్టర్ సస్పెండ్ చేశారు. వార్డెన్‌పై పలు ఆరోపణల నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఆమెని ఆదేశించారు.అసలేం జరిగిందంటే.. డిగ్రీ విద్యార్థినిని వార్డెన్ చితకబాదిన వీడియో ఒకటి తాజాగా వైరల్‌గా మారింది. ఎగ్జిట్ అయి చెప్పి పోయినవ్ కదా హాస్టల్‌లో.. ఎగ్జిట్ పన్నెండింటికి అయిపోతది. మళ్లీ ఎగ్జిట్ అయిపోయే టైం హాస్టల్ ఉండాలన్న సోయి లేదా నీకు అంటూ వార్డెన్ ఓ వైపు కర్రలు, మరోవైపు చేతులతో విద్యార్థినిని చితకబాదింది. ఆ సమయంలో అక్కడే ఉన్న తోటి విద్యార్థినులు వీడియో తీశారు. గత 24న జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో తాజాగా వైరల్‌గా మారింది. దీంతో వార్డెన్ తీరుపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. ఇదే కాకుండా ఇదే వార్డెన్ రెండు నెలల క్రితం విద్యార్థినులకు మత బోధనలు చేయించడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఈ రెండు ఘటనలను సీరియస్‌గా తీసుకున్న జిల్లా కలెక్టర్.. వార్డెన్ భవానీని సస్పెండ్ చేశారు.

# ఓటర్ల జాబితా సవరణపై కలెక్టర్ సమీక్ష

**-నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



నాగర్ కర్నూల్, డిసెంబర్ 30:నాగర్‌కర్నూల్ జిల్లాలోని మున్సిపాలిటీలకు సంబంధించి అన్ని వార్డుల్లో పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఇవాళ కలెక్టరేట్‌లోని తన చాంబర్ లో అదనపు కలెక్టర్ దేవ సహాయంతో కలిసి మున్సిపాలిటీల్లో ఓటర్ల జాబితా సవరణపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా ఈ నెల 30న పోలింగ్ స్టేషన్ల వారీగా డేటాను తిరిగి అమర్చాలని, 31న వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్ల సమాచారాన్ని పునర్వ్యవస్థీకరించి, అదే రోజు పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల రోల్స్‌లో డేటాను చేర్చాలని సూచించారు. జనవరి 1న పేర్లు, చిరునామాలపై అభ్యంతరాలను స్వీకరించి, అనంతరం నోటీసు బోర్డులపై పోలింగ్ స్టేషన్ల వారీగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రచురించాలని తెలిపారు. జనవరి 5న మున్సిపాలిటీ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించాలని, 6న జిల్లా స్థాయిలో ఎన్నికల అధికారుల సమీక్ష అనంతరం జనవరి 10న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని ఆదేశించారు.

మున్సిపాలిటీ ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు మున్సి పాలిటీ కేంద్రాల్లోనే ఓట్ల లెక్కింపుకు అవసరమైన భవనాలను సిద్ధం చేయాలని కలెక్టర్ కమిషనర్లకు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులు బాధ్యతయుతంగా పని చేయాలి : భూపతిరెడ్డి

కరీంనగర్, డిసెంబర్ 30: ఆర్టీ సీ ఉద్యోగులు బాధ్యతయుతంగా పని చేసి సమ్మక్క -సారక్క జాతరను విజయవంతం చేయాలని ఆర్టీసీ డిప్యూటీ రిజినల్ మేనేజర్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా కోరుట్లపట్టణంలోని టీజీ ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఆర్టీసీ ఉద్యోగులకు ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మేడారం-సమ్మక్క సారలమ్మ జాతర కోసం విధులు నిర్వహించే ఉద్యోగులు బాధ్యతయుతంగా పని చేయాలని ఆయన సూచించారు.

తమకు కేటాయించిన విధుల్లో అలసత్వానికి తావు లేకుండా ఉద్యోగులు నిబద్ధతతో పూర్తి చేయాలని పేర్కొన్నారు. అధికారులు ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

# రథం చెరువులో చేప పిల్లల విడుదల

ఎడపల్లి, డిసెంబర్ 30: ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామ శివారు ప్రాంతంలో గల రథం చెరువులో ఇవాళ సర్పంచ్ అనురాధ కిషన్ గౌడ్, ఉపసర్పంచ్ నీలం కృష్ణ, పంచాయతీ కార్యదర్శి సందీప్, మత్స్య శాఖ అధికారులు, మత్స్య సహకార సంఘం సభ్యులతో కలిసి చెరువులో చేప పిల్లలను వదిలారు. అనంతరం సర్పంచ్, ఉపసర్పంచ్, మత్స్య సహకార సంఘం సభ్యులు దుబాక గంగాధర్‌లు మాట్లాడుతూ.. మత్స్యకార సంఘాలు లాభాల బాటలో పయనించేందుకు గాను సంఘం సభ్యులు పాటుపడాలని, అప్పుడే గంగపుత్రులు ఆర్థికంగా ఎదిగేందుకు ఆస్కారం కలుగుతుందన్నారు.

రథం చెరువులో వందశాతం సబ్సిడీపై మొత్తం 25,800 చేప పిల్లలను వదలడం జరిగిందని తెలిపారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా చెరువులో చేప పిల్లలను వదలడం శుభసూచికంగా భావిస్తున్నట్లు తెలిపారు. అయితే మత్స్యకార సంఘాలకు అందించే చేప పిల్లల మొత్తం కౌంట్ కచ్చితంగా ఉండేలా మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, అప్పుడే గంగ పుత్రులకు లబ్ధి చేకూరుతుందన్నారు.

చెరువుల్లో చేపలు ఆరోగ్యంగా పెరిగేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను అటు మత్స్యకారులు, ఇటు అధికారులు తూచా తప్పకుండా పాటించాలని, అప్పుడే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం పూర్తవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య అభివృద్ధి డివిజనల్ అధికారి లయక్ మోహియుద్దీన్, ఫీల్డ్ అసిస్టెంట్ నరేందర్, మత్స్యకారులు విజయ్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి : బి.నరసింహారావు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 30 : ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులందరికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పీడీఎస్‌యూ మహాసభ దీక్షిత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో చదువుతున్న పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సౌకర్యం కల్పించకపోవడంతో విద్యార్థులంతా అర్ధాకలితో చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ కాలేజీల్లో చదివే ఇంటర్ విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ మెయిన్స్, నీట్ లాంటి వివిధ ఎంట్రెన్స్ పరీక్షలకు నిపుణులైన అధ్యాపకులచే శిక్షణ క్లాసులు బోధించాలని, ల్యాబ్, లైబ్రరీ, కంప్యూటర్ లాంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ఇంటర్, డిగ్రీ చదువుతున్న బాలురందరికి ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర నాయకుడు బి.అజయ్, జిల్లా నాయకులు వంశీ, కార్తీక్‌లు ప్రసంగించారు. అనంతరం పీడీఎస్‌యూ హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ నూతన కమిటీని 15 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దీక్షిత్, ఉపాధ్యక్షుడిగా అజయ్, ప్రధాన కార్యదర్శిగా చరణ్, సహాయ కార్యదర్శిగా డి.అర్చన, కోశాధికారిగా శివ, సభ్యులుగా ఎ.చరణ్, సిద్ధు, రాహుల్, భూక్య వీరన్న, చైతన్య, లవకుమార్, రితీష్, అఖిల్‌ని ఎన్నుకున్నారు.

# కరీంనగర్ శివారులో పెద్దపులి సంచారం

కరీంనగర్ : కరీంనగర్ రూరల్‌మండలం చర్లబూత్కుర్, కొండాపూర్ ఐత్రాచుపల్లి చమనపల్లి, బహదూర్ ఖాన్‌పేట గ్రామాల్లో పులి సంచరించినట్లు అధికారులు గుర్తించారు. ఈ గ్రామాల పరిధిలోని మామిడి తోటలు, పంట పొలాల్లో పులి పాదాలను గుర్తించిన స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి పరిశీలించారు.

అవి పులి పాదాల గుర్తులేనని ధృవీకరించి స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు. ఒంటరిగా బయటక వెళ్లకూడదన్నారు. ఈ గ్రామాలతో ఈ ప్రాంతంలోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

# మాచవరం గ్రామంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి

మెదక్, డిసెంబర్30: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులు మంగళవారం వేకువజాము నుంచే వైష్ణవ ఆలయాలకు తరలివెళ్లి.. ఉత్తర ద్వార దర్శనాలు చేసుకుంటున్నారు.

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మెదక్ మండలంలోని మాచవరం గ్రామంలోని శ్రీ కోదండ రామాయలయంలో ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాచవరం సర్పంచ్ దాసరి సాంబశివరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కమిటీ డైరెక్టర్ బెల్లం శ్రీనివాస్ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదగిరిగుట్టలో ఉదయం 5.40 నిమిషాల నుంచి ఉత్తర గోపురం ద్వారా లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి అనుమతిస్తున్నారు. వేములవాడలో రాజన్న ఆలయానికి అనుబంధంగా ఉన్న భీమన్న గుడిలో ఉత్తర ద్వార దర్శనాలు నిర్వహించారు. తిరుమల శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామునే ఉత్తర ద్వారాన్ని తెరిచారు. దీంతో భక్తులు పెద్ద ఎత్తున శ్రీవారిని దర్శించుకుంటున్నారు

# డేహరాడున్‌లో జరిగిన కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో నగర విద్యార్థుల పతకాల పంట



హైదరాబాద్ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );9వ జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు దేహరాడున్ లోజరిగాయి. ఈ పోటీలకు నగరానికి చెందిన కరాటే మాస్టర్ కళ్యాణ్ గౌడ్ ఆధ్వర్యంలో బయలు దేరిన విద్యార్థులు పోటీలలో పలు పథకాలు సాధించారు. వీరిలో వినయ్ యాదవ్, ఆలోకమిశ్రా, గురుతేజ, జై వైష్ణవి, ప్రియాంక, కృతిక్రాజ్, సత్యదేవాస్, శ్లోక కార్తీక్ వివిధ విభాగల్లో 7 బంగారు, 7,వెండి, 4,కాంస్య పథకాలను గెలిచారు. మాస్టర్ కళ్యాణ్ తో పాటు కోషి మాస్టర్ సాయి యాదవ్ కూడ పాల్గొన్నారు.

# వంగవీటి వారసుల రాజకీయ పోరాటాలు !

అమరావతి డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );వంగవీటి రంగా బంధువులు అంతా తెరపైకి వస్తున్నారు. ఎవరికి వారు అవకాశమున్న పార్టీల్లో లేదా ప్రత్యేక వేదికలు పెట్టి తమ రాజకీయ భవిష్యత్‌ను రంగా జయంతి, వర్ధంతి సందర్భాల్లో వివాదాస్పద వ్యాఖ్యలతో తీర్చిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారు. వంగవీటి రంగా కుమారుడు రాధా ఇప్పటికే రాజకీయాల్లో ఉన్నారు. గత రెండు ఎన్నికల్లో ప్రత్యక్షంగా పోటీ చేయలేదు. కానీ ఆయన తన అనుచరులకు అందుబాటులో ఉంటున్నారు. వీలైనంత వరకూ ఆయన అందరి మనిషి అనే పేరు తెచ్చుకుంటున్నారు. వివాదాస్పద రాజకీయాలకూ దూరంగా ఉంటున్నారు. రాజకీయంగా మంచి రోజుల కోసం చూస్తున్నారు. ఇటీవల కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు. టీడీపీలో ఆయనకు త్వరలో ముఖ్య పదవి లభిస్తుందన్న ప్రచారం జరుగుతోంది తాజాగా వంగవీటి రంగా కుమార్తె ఆశాకిరణ్ తెరపైకి వచ్చారు. వంగవీటి రంగాకు కుమార్తె ఉన్నారనే చాలా మందికి తెలియదు. హఠాత్తుగా ఆమె తెరపైకి వచ్చి రాధా, రంగా మిత్రమండలిని యాక్టివేట్ చేసుకున్నారు. ఆమెను వైసీపీ తెరపైకి తెచ్చిందని ప్రచారం జరుగుతోంది. అయితే ఆ వ్యాఖ్యల్ని ఆమె ఖండించారు. రాజకీయంగా యాక్టివ్ గా ఉంటానని చెబుతున్నారు కానీ ఏ పార్టీ అని చెప్పడం లేదు. కృష్ణా జిల్లాకు రంగా పేరు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.వీరికి తోడు చాలా కాలం నుంచి వంగవీటి నరేంద్ర అనే మరో బంధువు హడావుడి చేస్తూంటారు. కొన్నాళు బీజేపీలో.. కొన్నాళ్లు వైసీపీలో ఉంటారు. యూట్యూబ్ లకు ఇంటర్వ్యూలు ఇస్తూ వంగవీటి రంగా హత్యను ఏదో ఓ పార్టీకి పూసి.. తాను ఉన్న పార్టీకి మేలు చేసి.. తన వలుకుబడి పెంచుకోవాలనుకుంటారు. ఇప్పటికీ అవే ప్రయత్నాలు చేస్తున్నారు కానీ.. గుర్తించేవారు లేరు. ముందు ముందు ఇంకెంత మంది రంగా బంధువులు వస్తారో కానీ .. ఒక రాజకీయ ఆయుధంగా ఆయనను మార్చుకుని తమ రాజకీయ భవిష్యత్ కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు.

# నాచారం పరిధిలో లో దారుణం..బంగారం కోసం ఇంటి యజమాని హత్య

## – మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకుని గోదావరిలో పడేశారు

హైదరాబాద్ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మల్లాపూర్ బాబానగర్ ప్రాంతం నాచారం పరిధిలో లో దారుణం చోటు చేసుకుంది. ఒంటరిగా నివసిస్తున్నఇంటి యజమాని సుజాత (65) అనే మహిళ ఇంట్లో అద్దెకు ఉంటున్న ముగ్గురు క్యాబ్ డ్రైవర్లు హత్య చేశారు. కోనసీమ జిల్లా పేరవలి మండలం కొత్తప ల్లికి చెందిన ఎం.అంజిబాబు (33), సుజాత, అంజిబాబు కనిపించక పోవడంతో అనుమా నం కలిగి ఆమె సోదరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నెల 19 నుంచి సుజాత కోసం కుటుంబ సభ్యులు, పోలీసులు గాలిస్తున్నారు. అంజిబాబును అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు విచారణలో అంజిబాబు బంగారం కోసం హత్య చేసినట్లు గుర్తించగా.. తన స్నేహితులు యువరాజు, (18), దుర్గారావు(35) సహాయంతో మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకుని కోనసీమ జిల్లా కృష్ణ లంకకు తరలించి గోదావరిలో పడేశానని నేరం అంగీకరించారు. ప్రధాన నిందితుడు అంజిబాబుకు సహకరించిన స్నేహితులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు ట్రాలీ బ్యాగ్ లో సుజాత మృతదేహాన్నిగుర్తించారు.

**మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకుని గోదావరిలో పడేశారు**

మల్లాపూర్ బాబానగర్ ప్రాంతం నాచారం పరిధిలో లో దారుణం చోటు చేసుకుంది. ఒంటరిగా నివసిస్తున్నఇంటి యజమాని సుజాత(65) అనే మహిళ ఇంట్లో అద్దెకు ఉంటున్న ముగ్గురు క్యాబ్ డ్రైవర్లు హత్య చేశారు. కోనసీమ జిల్లా పేరవలి మండలం కొత్తపల్లికి చెందిన ఎం.అంజిబాబు (33), సుజాత, అంజిబాబు కనిపించకపోవడంతో అనుమానం కలిగి ఆమె సోదరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నెల 19 నుంచి సుజాత కోసం కుటుంబ సభ్యులు, పోలీసులు గాలిస్తున్నారు.

అంజిబాబును అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు విచారణలో అంజిబాబు బంగారం కోసం హత్య చేసినట్లు గుర్తించగా.. తన స్నేహితులు యువరాజు, (18), దుర్గారావు(35) సహాయంతో మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకుని కోనసీమ జిల్లా కృష్ణలంకకు తరలించి గోదావరిలో పడేశానని నేరం అంగీకరించారు. ప్రధాన నిందితుడు అంజిబాబుకు సహకరించిన స్నేహితులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు ట్రాలీ బ్యాగ్ లో సుజాత మృతదేహాన్నిగుర్తించారు.

# సకల శాస్త్రాలకు మూలం గణితం : డీఈఓ భిక్షపతి



నల్గొండ, డిసెంబర్ 30: సకల శాస్త్రాలకు మూలం గణితం అని, కావునా పాఠశాల దశలోనే విద్యార్థులకు గణితంపై ఆసక్తి పెంచేలా బోధన సాగించాలని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. నల్లగొండలోని డైట్ కళాశాలలో మంగళవారం తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం, దశరథ మెమోరియల్ ఫౌండేషన్ సౌజన్యంతో విద్యార్థులకు నిర్వహించిన జిల్లాస్థాయి గణితం టాలెంట్ టెస్ట్ ముగింపునకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో రాణించేలా తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. తెలంగాణ గణిత ఫోరం (టీఎంఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అద్దంకి సునీల్, కొరివి కృష్ణా, కోశాధికారి అమరేందర్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నర్సింహ్మా, డీసీఈబీ కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్, దశరథ మెమోరియల్ ఫౌండేషన్ కార్యదర్శి కొరివల్లి సురేశ్ కుమార్, గణిత ఉపాధ్యాయులు రాజు, అష్ర స్‌అలీ, డి.సైదులు గౌడ్ పాల్గొన్నారు.

**విజేతలు వీరే**

టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు ఇంగ్లీష్ మీడియంలో బి.దీపన్‌రెడ్డి, జెడ్పీహెచ్‌ఎస్ చిన్నకాపర్తి, చిట్యాల, ఎన్.ఉమా, డి.త్రినైని– జడ్పీహెచ్‌ఎన్ పాల్వాయి గుర్రంపోడు, తెలుగు మీడియంలో సీహెచ్ నందు, జడ్పీహెచ్‌ఎన్ బాలురులకు సర్టిఫికెట్లతో పాటు నగదు పురస్కారం రూ.5 వేలను అందచేసి అభినందించారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జలదోపిడీకి పాల్పడుతుంది

**–ఆ అక్రమ నిర్మాణంలో సూత్రధారి చంద్రబాబు, పాత్రధారి రేవంత్‌రెడ్డి : హరీశ్‌రావు**

హైదరాబాద్ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జలదోపిడీకి పాల్పడుతున్నదని, ముందుగా గోదావరి బనకచర్లతో జలదోపిడీకి ప్రయత్నించిన ఆంధ్రప్రదేశ్.. నష్టనివారణ కోసం గోదావరి నల్లమల సాగర్‌కు మార్చుకుందని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. నల్లమల సాగర్ అక్రమ నిర్మాణానికి సూత్రధారి చంద్రబాబు అయితే, పాత్రధారి రేవంత్ రెడ్డి అని చెప్పారు. కత్తి చంద్రబాబుదే అయినా పొడిచేది మాత్రం రేవంత్‌రెడ్డి అన్నారు.ఇవాళ తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ నేతలతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించిన ఆయన.. రేవంత్‌రెడ్డి తీరును ఎండగట్టారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు ద్రోహం చేస్తున్నడు సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. ‘అంటే ఆయన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నడా.. లేదంటే చంద్రబాబుకుగురుదక్షిణ చెల్లించుకుంటున్నడా నాకైతే అర్థమైతలేదు’ అని వ్యాఖ్యానించారు.రేవంత్‌రెడ్డి నోరు తెరిస్తే అబద్దాలు మాట్లాడుతున్నడని ఆరోపించారు. బనకచర్ల విషయంలో కూడా ఎన్నో అబద్ధాలు చెప్పిండని తెలిపారు. ఆయన మాటలకు, చేతలకు పొంతనే ఉండట్లేదని మండిపడ్డారు.

# బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా తాళ్ల పద్మ

నిజామాబాద్,డిసెంబర్ 30: రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం సంయుక్త కార్యదర్శిగా బోధన్ సీడీపీఓ తాళ్ల పద్మను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్ గౌడ్ నియామకపత్రాన్ని అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పద్మను రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకున్నారు.

నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు కరిపే రవీందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. రమా, జిల్లా ఉపాధ్యక్షులు దారం భూమన్నలు పాల్గొనగా పద్మను నియామకం చేశారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ..బీసీ ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు వెళ్తామని, తనవంతు బాధ్యతను శక్తిమేర నిర్వహిస్తానని చెప్పారు. అవకాశం కల్పించిన రాష్ట్ర, జిల్లా బాధ్యులకు కృతజ్ఞతలు చెప్పారు.

# ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ

**–మండల ప్రత్యేక అధికారి శీలం శ్రీమన్నారాయణ**

నర్సింహులపేట, డిసెంబర్ 30: ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు యూరియా పంపిణీ జరుగుతుందని మండల ప్రత్యేక అధికారి శీలం శ్రీమన్నారాయణ అన్నారు. ఈ రోజు మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో రైతులతో మాట్లాడారు. ప్రస్తుత యాసంగి (రవి) సీజన్ సాగుకు అవసరమైన పూర్తిస్థాయి యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఎలాంటి ఆందోళన చెందవద్దని అన్నారు.

పంపిణీ సాఫీగా జరిగేందుకు ప్రణాళికలు రూపొందించామని, సహకార సంఘాలు ఇతర కేంద్రాలలో సరిపడ యూరియా అందుబాటులో ఉంచామన్నారు. పంపిణీలో పారదర్శకత కోసం యూరియా బుకింగ్ యాప్‌ను ప్లే స్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. రైతులకు యాప్ వినియోగంలో సహకరించేందుకు పంపిణీ కేంద్రాల వద్ద వ్యవసాయ సహకార శాఖల సిబ్బంది అందుబాటులో ఉంటారని, ప్రతి కేంద్రంలో యాప్ క్యూఆర్ కోడ్ ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భూక్య రాధ, మండల వ్యవసాయ శాఖ అధికారి వినయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# గద్వాల జిల్లాలో దారుణం..

# కన్నకూతురికి కడుపు చేసిన తండ్రి..

గద్వాల డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గద్వాల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. కన్న కూతురిపైనే అత్యాచారానికి పాల్పడిన ఓ తండ్రి ఆమెను గర్భవతిని చేశాడు. ఈ విషయం తాజాగా వెలుగులోకి రావడంతో నిందితుడితో పాటు అతనికి సహకరించిన మొదటి భార్యను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గద్వాల జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తికి కొన్నేళ్ల క్రితం వివాహమైంది. కానీ వారికి పిల్లలు పుట్టలేదు. దీంతో భార్య చెల్లిని రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్యకు నలుగురు సంతానం కలిగారు. అనంతరం మొదటి భార్యకు కూడా ఇద్దరు పిల్లలు పుట్టారు. ఇదిలా ఉంటే.. రెండో భార్య కూతురు (16)పై సదరు వ్యక్తి కన్నేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు.ఈ క్రమంలో బాధిత బాలిక గర్భం దాల్చింది. ఈ విషయం బయటకు రాకుండా ఉండాలని బాలికకు సదరు వ్యక్తి మొదటి భార్య గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్ చేయించింది.అయితే, ఈ విషయాన్ని బాధిత బాలిక ఇటీవల స్థానికంగా ఉండే మహిళకు చెప్పింది. దీంతో బాధితురాలి తల్లికి ఆమె జరిగిన విషయాన్ని వెల్లడించింది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితుడిని, అతనికి సహకరించిన మొదటి భార్యను అదుపులోకి తీసుకున్నారు.

# సింగరేణి బకాయిలపై శ్వేత పత్రం విడుదల చేయాలి : మిరియాల రాజిరెడ్డి

గోదావరిఖని, డిసెంబర్ 30: సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలపై ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్ ) అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థకు ఇప్పటివరకు ట్రాన్స్‌కో, జెన్‌కోల నుంచి బొగ్గు అమ్మకాల ద్వారా బకాయిలు రూ. 47 వేల కోట్లకు చేరుకున్నాయని వీటిలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే 24 వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని విమర్శించారు.

పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడంతో సింగరేణి సంస్థ కార్మికులకు జీతాలు చెల్లించడానికి ఓవర్ డ్రాఫ్ట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిం దని దీనికి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. కెసిఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో సింగరేణి సంస్థను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవడంతో పాటు కార్మికుల సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని..ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తీవ్రమైన రాజకీయ జోక్యంతో తమ ఇష్టం వచ్చిన రీతిలో సింగరేణి సొమ్మును వాడుకుంటూ దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోతున్న.. ఆ విషయంలో గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్టీయూసీలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సింగరేణి నిధుల దుర్వినియోగంపై సంస్థకు రావాల్సిన బకాయిలపై సింగరేణి సంస్థ ద్వారా పూర్తి వివరాలతో కూడిన శ్వేత పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు గడిచిన రెండు సంవత్సరాల కాలంలో కార్మికులకు సంబంధించిన ఎలాంటి సమస్యలు పరిష్కారం చేయలేదని సింగరేణి సంస్థ నిర్వీర్యం అవుతున్న పట్టించుకోవడంలేదన్నారు. ఇవి చాలదన్నట్లు టీబీజీకేఎస్ పై నోరు పారేసుకుంటూ విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో టీబీజీకేస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, నాయకులు నూనె కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి




దండేపల్లి, ఆంధ్రప్రభ : ప్రతి విద్యార్థి సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలని వెరబెల్లి ఫౌండేషన్ అధ్యక్షులు రఘునాథరావు పేర్కొన్నారు. దండేపల్లి మండలం వెల్గనూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన ఇవాళ ఐదు లాప్టాప్ లు, టీవీ అందజేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు కష్టపడి చదువుకొని ముందుకు రావాలని సూచించారు. నేటి సాంకేతిక యుగంలో ప్రతి విద్యార్థి సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటేనే భవిష్యత్తులో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.. అనంతరం సర్పంచ్ గా ఎన్నికైన మానస తులసి, రఘునాథరావు ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, బీజేపీ నాయకులు బందెల రవి గౌడ్, గోపతి రాజయ్య, సురేష్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# పాలనపై పట్టులేదు.. సంక్షేమంపై పట్టింపు లేదు : కొప్పుల ఈశ్వర్



ధర్మపురి, డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెన్ న్యూస్ );: మాయమాటలు, ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు గడిచిన పరిపాలనపై పట్టు సాధించలేక, అభివృద్ధిని ముందుకు నడిపంచక, సంక్షేమంపై పట్టింపులేక ఘోరంగా వైఫల్యం చెందిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. మంగళవారం ఆయన జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని మాతాశిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం భవనాన్ని పరిశీలించారు. ధర్మపురిలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 8.50కోట్ల వ్యయంతో నిర్మించిన 50 పడకల మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఇంతవరకు అందుబాటులోకి తీసుకురా కపోవడం విడ్డూరమని, ఈ సందర్భంగా ఎంపీహెచ్ భవనం ముందు బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో 60 ఏండ్ల పాటు ఉనికిని కోల్పోయిన తెలంగాణకు.. ప్రత్యేక రాష్ట్రంలో ఊపిరిలూదిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. కుదేలైన ప్రతి రంగాన్ని వనరులు, శక్తిని కూడదీసుకొని ఆయన నగర్వంగా నిలబెట్టారన్నారు. హామీల అమలులో విఫలవె ైందని, రాష్ట్రంలో ఖర్చులు ఆదాయాల పట్ల లేకపోవడంతో ప్రభుత్వం పై ఒత్తిడి పెరిగి సంక్షేమ పథకాలపై [illegible] చూపుతోందన్నారు.జిల్లా కేంద్రంలో ఉండవలసిన మాతాశిశు కేంద్రాన్ని కేసీఆర్ సహకారంతో ధర్మపురి టెంపుల్ సిటీ అయినందున చుట్టుపక్కల ప్రాంతాల మహిళలకు, పిల్లలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడం కోసం ప్రత్యేక చొరవతో మాతాశిశు ఆరోగ్య కేంద్రం నిర్మించామన్నారు. ఒండుసంవత్సరాల క్రితమే ఈ మాతా శిశుసంరక్షణ కేంద్రాన్ని కేటీఆర్ చేతులమీదుగా ప్రారంభించుకున్నామని గుర్తుచేశారు. ఆతర్వాత ప్రభుత్వం మారడంతో దవాఖానను పట్టించుకున్న నాథుడే లేడన్నారు. ధర్మపురి ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న లక్ష్మణ్ కుమార్ హాస్పిటల్‌ను ఎందుకు అందుబాటులోకి తీసుకురావడం లేదని ప్రశ్నించారు. రెండు సంవత్సరాలు ప్రారంభించక పోయినా ఓపిక పట్టామని, ఇప్పుడు నిరసనలు తెలుపుతున్నామని, రానున్న రోజుల్లో మరింత తీవ్రంగా [illegible] హెచ్చరించారు.త్వరలో హాస్పిటల్ సేవలను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యకమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ డా ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సంగి సత్తెమ్మ, బీఆర్ఎస్ మండల, పట్టణ కన్వీపర్లు అయ్యోరి రాజేష్ కుమార్, బండారి రంజిత్, సంగీ శేఖర్, చిలివేరి శ్యాంసుందర్, వోడ్నాల మల్లేశం, ఎల్లాగౌడ్, బండారి అశోక్, అయ్యోరి వేణు, తరాల కార్తీక్, అనంతుల విజయలక్ష్మి ,యూనుస్, ఆసిఫ్, లక్ష్మణ్ ,మహేష్, జగన్, రాంచందర్, సురేంద ర్, ప్రశాంత్, రిషిరెడ్డి ,ప్రసాద్ తదితరులున్నారు

# గ్రామాభివృద్ధికి సహకరించాలి : సర్పంచ్ కంభంపాటి శ్రీనివాస్



నల్గొండ, డిసెంబర్ 30: గ్రామ పౌరులు, యువత, అన్ని వర్గాల వారు గ్రామ అభివృద్ధికి సహకరించాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, రామన్నపేట మండలం పల్లివాడ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాసులు కోరారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వ్యాపారులు, వార్డు సభ్యులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిషేధిత గుట్కాలు, సిగరెట్లు, మత్తు పానీయాలు అమ్మి యువతను అనారోగ్యం పాలు చేయొద్దని వ్యాపారులను కోరారు. వ్యవసాయ పొలాలు దున్నే ట్రాక్టర్లు ఫుల్ వీల్స్ తో రోడ్డుపై వెళ్లి రోడ్డు చెడిపోవడానికి కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చికెన్ సెంటర్ లో యజమానులు వ్యర్థాలను డంపింగ్ యార్డులో పడవేయాలని సూచించారు. అందరూ గ్రామం కోసం, గ్రామ అభివృద్ధి కోసం సహకరించాలని కోరారు.

# జ్ఞానోత్సవం ముగిసింది...పఠన సంస్కృతి మిగిలింది

## –అక్షర సంస్కృతికి అద్దం పట్టిన హైదరాబాద్ పుస్తక మేళా
## –పఠనం తగ్గలేదని రుజువు చేసిన పుస్తక పండుగ



హైదరాబాద్ నగరం మరోసారి పుస్తకాల పండుగతో పులకరించింది. 2025 సంవత్సరంలో మరోసారి పుస్తక ప్రేమికుల రాజధానిగా నిలిచింది. 2025 హైదరాబాద్ బుక్ ఫేర్ విజయవంతంగా ముగిసింది.

ఆధునిక సాంకేతిక యుగంలో చదువుకునే అలవాటు తగ్గిపోతుందన్న ఆందోళనల నడుమ, హైదరాబాద్ బుక్ ఫేర్-2025 పుస్తకం ఇంకా జీవంతంగా ఉందని, పాఠకుడితో దాని అనుబంధం చెక్కుచెదర లేదని బలంగా చాటి చెప్పింది. పదిరోజులకు పైగా సాగిన ఈ జ్ఞానోత్సవం వేలాది పాఠకులను, రచయితలను, ప్రచురణ కర్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. ఈ పుస్తక పండుగ నగర సాంస్కృతిక జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచి విజయవంతంగా ముగిసింది.

ఈ ఏడాది బుక్ ఫేర్ నిర్వాహణ ముందే విశేష ఆసక్తి నెలకొంది. గత అనుభవాల ఆధారంగా ప్రాంగణాన్ని విస్తరించడం, స్టాల్ల సంఖ్యను పెంచడం, భద్రతా ఏర్పాట్లు చేయడం వంటి చర్యలు చేపట్టారు. ఫలితంగా సుమారు 350 నుంచి 380 మధ్యలో స్టాల్లు ఏర్పాటు చేయబడ్డాయి. వీటిలో మెజారిటీగా తెలుగు పుస్తకాల స్టాల్లే ఉండటం విశేషం. సుమారు 60 శాతం పైగా స్టాల్లు తెలుగు ప్రచురణ కర్తలకు కేటాయించబడటం, తెలుగు పుస్తక మార్కెట్ ఇప్పటికీ బలంగా ఉందన్న వాస్తవాన్ని ప్రతిబింబించింది. ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, సంస్కృతం, తమిళం, కన్నడ భాషల పుస్తకాలూ సముచితంగా దర్శనమిచ్చాయి. ముఖ్యంగా ఉర్దూ-తెలుగు ద్విభాషా పుస్తకాలు, అనువాద గ్రంథాలు ఈసారి ఎక్కువగా కనిపించాయి.


పుస్తకాల పరంగా ఈ బుక్ ఫేర్ ఒక విశాలమైన జ్ఞాన ప్రదర్శనగా నిలిచింది. సాహిత్య గ్రంథాలతో పాటు చరిత్ర, రాజకీయాలు, సమాజ శాస్త్రం, ఆర్థికం, తత్వశాస్త్రం, బాల సాహిత్యం, మహిళా అధ్యయనాలు, దళిత?బహుజన రచనలు, జీవిత చరిత్రలు, స్మృతిగ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు పెద్ద సంఖ్యలో విక్రయమయ్యాయి. తెలంగాణ చరిత్ర, స్వరాష్ట్ర ఉద్యమం, భాషా-సాంస్కృతిక వారసత్వంపై వచ్చిన కొత్త పుస్తకాలకు పాఠకులు ప్రత్యేక ఆసక్తి చూపించారు. ప్రచురణకర్తల అంచనాల ప్రకారం ఈసారి బుక్ ఫేర్‌లో సుమారు 12 నుంచి 15 లక్షల పుస్తకాలు విక్రయమైనట్లు తెలుస్తోంది. మొత్తం వ్యాపార పరిమాణం దాదాపు 25 నుంచి 30 కోట్ల రూపాయల వరకు చేరినట్లు అంచనా వేస్తున్నారు. ఇది గత ఏడాదితో పోలిస్తే సుమారు 15 నుంచి 20 శాతం వృద్ధిగా భావించవచ్చు.

పాఠకుల హాజరు ఈ బుక్ ఫేర్‌కు ప్రధాన బలం. రోజుకు సగటున 50 వేల మందికి పైగా పాఠకులు బుక్ ఫేర్‌ను సందర్శించగా, శని-ఆదివారాల్లో ఈ సంఖ్య లక్షను దాటింది. మొత్తం మీద 8 నుంచి 10 లక్షల మంది పాఠకులు బుక్ ఫేర్‌కు వచ్చారని నిర్వహణ వర్గాలు వెల్లడించాయి. వీరిలో విద్యార్థులు, యువత శాతం గణనీయంగా ఎక్కువ. పాఠశాలలు, కళాశాలలు ప్రత్యేకంగా విద్యార్థులను బుక్ ఫేర్‌కు తీసుకురావడం వల్ల, ఈ పుస్తక పండుగ ఒక విద్యా అనుభవంగా మారింది. పిల్లలు బాల సాహిత్య విభాగాల వద్ద గుమిగూడటం, యువత సమకాలీన రచనలపై ఆసక్తి చూపడం భవిష్యత్ పఠన సంస్కృతికి ఆశాజనక సంకేతంగా నిలిచింది.

రచయితల భాగస్వామ్యం ఈ ఏడాది మరింత విస్తృతంగా కనిపించింది. ఈ ఏడాది నిర్వహణలో అనేక సానుకూలాంశాలు కనిపించాయి. ముఖ్యంగా పాఠకుల సంఖ్య గత సంవత్సరాల కంటే పెరగడం గమనార్హం. విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరుకావడం పుస్తక సంస్కృతికి శుభ సూచకం. పాఠశాలలు-కళాశాలల నుండి సమూహాలుగా వచ్చిన విద్యార్థులు పుస్తకాల కొనుగోలు, రచయితలతో సంభాషణల ద్వారా జ్ఞానానుభవాన్ని పొందారు.

సుమారు 300 మందికి పైగా రచయితలు వివిధ రోజుల్లో బుక్ ఫేర్‌కు హాజరై పాఠకులతో ప్రత్యక్షంగా మమేకమయ్యారు. పుస్తకావిష్కరణలు, సంతక కార్యక్రమాలు, చర్చావేదికలు పాఠకులను ఆకట్టుకున్నాయి. సీనియర్ రచయితల అనుభవాలు, కొత్త తరం రచయితల ఆలోచనలు ఒకే వేదికపై కలవడం తెలుగు సాహిత్యానికి కొత్త దిశను సూచించింది. ముఖ్యంగా సమకాలీన సామాజిక సమస్యలు, రాజకీయ పరిణామాలు, భాషా ఉద్యమాలు, మహిళా దృక్కోణాలు వంటి అంశాలపై జరిగిన చర్చలు బుక్ ఫేర్‌ను కేవలం కొనుగోలు కేంద్రంగా కాకుండా ఆలోచనా వేదికగా తీర్చిదిద్దాయి.

నిర్వహణ విషయానికి వస్తే, బుక్ ఫేర్ కమిటీ చేసిన కృషి ప్రశంసనీయం. విశాలమైన ప్రాంగణం, భద్రతా ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు పండుగ వాతావరణాన్ని సృష్టించాయి. అయితే, కొన్ని లోపాలు కూడా స్పష్టంగా కనిపించాయి. స్టాల్ల అమరిక పూర్తిగా వ్యవస్థబద్ధంగా లేకపోవడం వల్ల పాఠకులు కావలసిన ప్రచురణకర్తలను వెతుక్కోవడంలో ఇబ్బంది పడ్డారు. స్పష్టమైన మ్యాప్‌లు, సూచిక బోర్డులు మరింత సమర్థవంతంగా ఏర్పాటు చేసి ఉంటే ఈ సమస్య కొంత మేర తగ్గేదని చెప్పవచ్చు. పార్కింగ్ సదుపాయాల కొరత, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యలు కొందరు పాఠకులను అసౌకర్యానికి గురి చేశాయి. వృద్ధులు,



మహిళలు, చిన్న పిల్లల కోసం మరింత విశ్రాంతి సదుపాయాలు, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ అవసరమన్న అభిప్రాయాలు వినిపించాయి.

ధరల అంశం కూడా చర్చకు వచ్చింది. కొంతమంది ప్రచురణకర్తలు 20 నుంచి 50 శాతం వరకు రాయితీలు ఇచ్చి పాఠకులను ఆకర్షించినా, కొన్ని ప్రముఖ పుస్తకాల ధరలు సామాన్య పాఠకులకు భారంగా అనిపించాయి. విద్యార్థుల కోసం ప్రత్యేక రాయితీ కూపన్లు, ప్యాకేజీలు ప్రవేశపెడితే పుస్తకాల విక్రయం మరింత పెరిగే అవకాశముందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలాగే డిజిటల్ పుస్తకాలు, ఆడియో బుక్స్, ఈ-పబ్లిషింగ్‌పై ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాల్సిన అవసరం కూడా ఈసారి స్పష్టంగా కనిపించింది.

మొత్తంగా హైదరాబాద్ బుక్ ఫేర్-2025 పుస్తక సంస్కృతికి ఒక బలమైన సందేశాన్ని ఇచ్చింది. డిజిటల్ మాధ్యమాలు ఎంత అభివృద్ధి చెందినా, పుస్తకాన్ని చేతిలో పట్టుకుని చదివే అనుభూతికి ప్రత్యామ్నాయం లేదని ఈ బుక్ ఫేర్ మరోసారి నిరూపించింది. పాఠకుడు?రచయిత?ప్రచురణకర్త మధ్య ప్రత్యక్ష అనుసంధానాన్ని కల్పించిన ఈ పుస్తక పండుగ, భవిష్యత్తులో మరింత ప్రణాళికాబద్ధంగా, ఆధునిక అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటే, దేశంలోనే అగ్రశ్రేణి బుక్ ఫేర్‌లలో ఒకటిగా నిలిచే సామర్థ్యం కలిగి ఉంది. జ్ఞానం, ఆలోచన, సంస్కృతి పునాదులపై నిలిచిన సమాజానికి పుస్తకం ఇప్పటికీ కేంద్ర. బిందువేనన్న సత్యాన్ని హైదరాబాద్ బుక్ ఫేర్-2025 గట్టిగా, స్పష్టంగా చాటిచెప్పింది.

**–రామ కిష్టయ్య సంగన భట్ల**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

# క్షేమంగా ఇంటికి చేరండి.. కుటుంబ సభ్యులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకండి

## – చిలుకల గూడా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జగన్ రెడ్డి

హైదరాబాద్ (సికింద్రాబాద్ ) డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); క్షేమంగా ఇంటికి చేరండి.. కుటుంబ సభ్యులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకండి అని చిలుకల గూడా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జగన్ రెడ్డి వాహన దారులకు విజ్ఞప్తి చేసారు.నూతన సంవస్సరం పురస్కరించుకొని ప్రత్యేకంగా నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో విలేకరులతో మాట్లాదారు. వాన దారులు మద్యం మత్తులో వాహనాలను నడపకూడదని హితవు పలికారు. గత సంవత్సరపు తీపి అనుభవాలను కుటుంబ సభ్యులతో ఆస్వాదిస్తూ నూతన సంవత్సరానికి శుభారంభం పలకాలని వాహనాలను కోరారు. వాన దారులు మద్యం మత్తులో వాహనాలను నడపకూడదని ఒకవేళ మద్యం మోతాదు మించి సేవిస్తే జరిగే ప్రమాదలను దృష్టి లో పెట్టుకొని ఆలోచించి క్యాబులను ఆశ్రయించాలని కోరారు. అంతే కాకుండా ప్రజలందరూ ట్రాఫిక్ రూల్స్ ను అధికమించకుండా ఇబ్బంది పడకుండా ఇల్లలకు చేరి తమ తమ కుటుంబ సభ్యులతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకోవాలని అన్నారు. ఈ ఒక్కరోజు పద్యం సేవించడం వల్ల జరిగే అనర్థాలను ప్రతి ఒక్కరు అర్థం చేసుకుని తమకు సహకరించాలని ఆయన కోరారు

# కరీంనగర్ బిజెపి కార్యకర్తకు వివాహ శుభాకాంక్షలు తెలియజేసిన ప్రధాని మోదీ

కరీంనగర్, డిసెంబర్ 30: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ బిజెపి నాయకులు , కాంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్ సోదరుడు శ్యామ్ వివాహం ఇటీవల జరిగింది. సోదరుడి వివాహ ఆహ్వాన పత్రికలను తోట సాగర్ భారతీయ జనతా పార్టీలోని ముఖ్య నేతలతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి పంపించారు. ఇట్టి వివాహ ఆహ్వాన పత్రికకు స్పందించిన ప్రధానమంత్రి మోదీ , కరీంనగర్ బిజెపి నాయకులు తోట సాగర్ సోదరుడు శ్యామ్ , రాణి వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ లేఖను పంపించారు. సోదరుడి వివాహ ఆహ్వానాన్ని మన్నించి , భారతీయ జనతా పార్టీలో సామాన్య కార్యకర్త కొనసాగుతున్న తనను గుర్తించి ప్రధానమంత్రి మోదీ వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ లెటర్ పంపించడం సంతోషంగా ఉందని, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తోట సాగర్ చెప్పారు.

# ప్రముఖ ఫ్రుడ్స్ హోల్సేల్ వ్యాపారి సయ్యద్ సాదిక్ భౌతిక కాయానికి పలువురు నేతలు నివాళి



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30:నేటినిజం (ప్రతినిధి ): వేములవాడ పట్టణంలోని సుభాష్ నగర్ లో మరణించిన ప్రముఖ ఫ్రూట్స్ హోల్ సేల్ వ్యాపారి, ఏ వన్ హోటల్ అధినేత సయ్యద్ సాదిక్ అకస్మాత్తుగా మరణించారు. భౌతిక కాయానికి ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్, బీ ఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, రాష్ట్ర మౌలానా సంఘం రాష్ట్ర అధ్యక్షులు నదీమ్ హైమద్ మౌలానా, పలువురు మాజీ కౌన్సిలర్, బి ఆర్ ఎస్ నాయకులు, నాయకులుమంగళవారం నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు అంజాత్ పాషా, షేక్ ఇమామ్, గౌస్ బాబా, ఉమర్, ఇంతియాజ్, ఐత వెంకటేశం, వనపర్తి పర్ష రాములు, విక్కుర్తి సాయి తదితరులు ఉన్నారు.

# మహాశివరాత్రి ఏర్పాట్లకు సన్నద్ధం కావాలి

## –అధికారులు సమన్వయంతో సౌకర్యాలు కల్పించాలి
## –ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,
## –జాతర చైర్ పర్సన్ ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
## – వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం




రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30:నేటినిజం (ప్రతినిధి ): మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్, జాతర చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14, 15, 16 తేదీల్లో మహా శివరాత్రి జాతర నిర్వహించనున్న నేపథ్యంలో వేములవాడ లోని భీమేశ్వర సదన్ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో జాతర సమన్వయ సమావేశాన్ని మంగళవారం జాతర ఛైర్మన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన నిర్వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బీ గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్, జాతర ఛైర్మన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. భక్తులు భీమేశ్వర ఆలయంలో స్వామి వారి దర్శనాన్ని వేగంగా, సౌకర్యంగా చేసుకునేలా ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని వివరించారు. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి శ్రీ ఆలయం దాకా, వేములవాడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లలో మరమ్మత్తులు, నిర్మాణాలు పక్కా ప్రణాళిక పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ లు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. తిప్పాపూర్ ఆర్ టీ సీ బస్ స్టాండ్ లో తాగు నీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి దానికి ఒక అధికారిని నియమించాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల నిర్వహణ వేములవాడ మున్సిపల్, జిల్లా పంచాయతి అధికారి సంయుక్తంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, ఎక్కడా ఇబ్బంది రాకూడదని స్పష్టం చేశారు. హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని, ప్రతి చోట అన్ని వివరాలతో కూడిన సైన్ బోర్డులు పెట్టించాలని, అందరి ఫోన్ నంబర్ లు ఉండాలని తెలిపారు. ఈ కేంద్రాల్లోని వారికి ఆలయానికి సంబంధించిన పూర్తి సమాచారం ఉండాలని ఆదేశించారు. జాతర విధుల్లో పాల్గొనే అన్ని శాఖల అధికారులు వారి సమగ్ర యాక్షన్ ప్లాన్ తో రావాలని తెలిపారు. ఆలయం లోని క్యూల వద్ద, పార్కింగ్ స్థలాల వద్ద తాగు నీటి, మజ్జిగ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.భక్తులకు అల్పాహారం ఉప్మా, పులిహోర, పెరుగు అన్నం, నీటి వసతి చక్కటి వాతావరణంలో కల్పించాలని సూచించారు. ప్రతి జాతర ప్రదేశాల్లో నాణ్యమైన తాగునీటిని అందుబాటులో పెట్టాలని ఆర్ డబ్ల్యూ ఎస్, మిషన్ భగీరథ అధికారులని ఆదేశించారు. మరో సమావేశం నిర్వహిస్తామని, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆదేశించారు. ఆలయ ఆవరణలో 24 గంటల పాటు వైద్య బృందం, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, ఫైర్ సేఫ్టీ అధికారులు ఆలయంలో పరిశీలించి, కావాల్సిన పరికరాలు వివరాలు అందజేయాలని సూచించారు. జాతర ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా చూడాలని, సమ్మక్క సారాలమ్మ జాతర నేపథ్యంలో బక్తుల కోసం వైద్య బృందం అందుబాటులో ఉండాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులకు సహాయం కోసం వీల్ చైర్లు వాలంటీరను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి చోట సైన్ బోర్డ్ లు ఉండాలని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార పదార్థాలను తనిఖీ చేయాలని సూచించారు. ప్రతి శాఖ అధికారి తమ పూర్తి యాక్షన్ ప్లాన్ తో రావాలని తెలిపారు. దర్శనం, వెహికల్ ఇతర పాస్ లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేస్తామని విప్, ఇంచార్జి కలెక్టర్ స్పష్టం చేశారు.మహా శివరాత్రి సందర్భంగా ట్రాఫిక్ కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేష్ బీ గితే తెలిపారు. సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరకు వచ్చే వీఐపీల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని వివరించారు. వేములవాడలో కావాల్సిన సైన్ బోర్డ్, సి సి కెమెరాలు ఉంచాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వాలంటీర్ లను తమకు అప్పగించాలని వివరించారు. సమావేశంలో ఏఎస్పీ రుత్విక్ సాయి, ఆర్డీఓ రాధాబాయి, ఆలయ ఈఓ రమాదేవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు ఉన్నారు.

# వరద బాధితులకు పరిహారం అందించాలి

## –తాహసిల్దార్ కు లిస్ట్ అందజేసిన కార్పొరేటర్

కరీమాబాద్, డిసెంబర్ 30: మొంథా తుఫాన్ ప్రభావంతో నష్ట పోయిన 34వ డివిజన్ శివనగర్ బాధితులందరికీ నష్ట పరిహారం అందించాలని 34 వ డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమార స్వామి నష్టపరిహారం అందని వరద బాధితుల లిస్టును మంగళవారం కిలా వరంగల్ మండల తాసిల్దార్ ఇక్బాల్ కు అందజేశారు.

34 డివిజన్ శివనగర్ కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు వరద బాధితులకు పరిహారం పాక్షికంగానే అందిందని పూర్తిస్థాయిలో అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మేము సేకరించిన వివరాల ప్రకారం మరో 100మంది లబ్ధిదారులకు పరిహారం అందాల్సి ఉందని ఆయన తెలిపారు. దీనికి సంబంధించిన బాధితులు తనకు దరఖాస్తులు అందజేశారని న్యాయమైన బాధితులకు వరద ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కొరకు కమిటీ వేశారని ఆ కమిటీకి డివిజన్ కార్పొరేటర్ ను చైర్మన్ గా నియమించారని అదే కమిటీ చే వరద బాధితుల నిజమైన లబ్ధిదారుల నివేదికను తయారు చేయించాలని అప్పుడే నిష్పక్షపాతికంగా సహాయం అందుతుందని ఆయన అన్నారు. డబుల్ బెడ్ రూమ్ లో మంజూరి గురించి కాంగ్రెస్ ప్రభుత్వానికి బి ఆర్ఎస్ ప్రభుత్వానికి లబ్ధిదారులు దరఖాస్తులు అందజేశారని వాటిలో కొందరిని ఎంపిక చేయుడం జరిగిందవి అవి అర్హులైన వారివేనా, కాదా అని విచారణ జరిపించి నిజమైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూంలు అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శివనగర్ లో అండర్ డక్ట్ నిర్మాణం చేపడుతున్న తరుణంలో 9 మంది ఇల్లు కోల్పోయారని అందులో 4గురు ఎస్ సిలు, 3 గురు మైనార్టీలు, ఇద్దర బిసిలు ఉండగా వీరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు అయి ఉన్నాయని. జిల్లా కలెక్టర్ దగ్గర అందుకు సంబంధించిన లిస్టు ఉన్నందున వారికి మొదటి ప్రాధాన్యతను ఇచ్చి వెంటనే వారికి అందజేయాలని కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి విజ్ఞప్తి చేశారు.

# మున్నూరుకాపు సత్రాన్ని సందర్శించిన ఆల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి

## – ఘనంగా సత్కరించిన రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30:నేటినిజం (ప్రతినిధి): ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఉట్కూరి నరేందర్ రెడ్డి మంగళవారం శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఉట్కూరి నరేందర్ రెడ్డి మున్నూరు కాపు నిత్యాన్న సత్ర సంఘం భవనంను సందర్శించారు. ఈ సందర్భంగా ఉట్కూరి నరేందర్ రెడ్డికిమున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య శాలువాతో సత్కరించి, రాజన్న చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం ఉట్కూరి నరేందర్ రెడ్డిమున్నూరు కాపు నిత్యాన్న సత్ర భవన నిర్మాణాన్ని, అన్న దాన సత్రాన్ని పరిశీలించి, నిర్వాకులను అభినందించారు. మున్ముందు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

# క్యాంపస్‌లోనే ఇన్నోవేషన్‌ను అప్ గ్రాడ్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీతో భాగస్వామ్యం కుదుర్చుకున్న కర్ణాటక సిద్ధార్థ అకాడమీ




హైదరాబాద్, డిసెంబర్ 30:కర్ణాటకలోని డీమ్డ్-టు-బీ-యూనివర్సిటీ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ తన ప్రస్తుత ఇంజినీరింగ్ కార్యక్రమాల్లో పరిశ్రమలకు అనుగుణమైన స్కూల్ ఆఫ్ టెక్నాలజీని ఏకీకృతం చేయడానికి తదుపరి తరం లెర్నింగ్ వేదిక అయిన అప్ గ్రాడ్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది.

సీఈఓ విశ్వ మోహన్ చీఫ్ రెవెన్యూ ఉ అవుట్‌కమ్ ఆఫీసర్ మెహుల్ ఖాంధేడియా నేతృత్వంలో అప్ గ్రాడ్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, విద్యా పాఠ్యక్రమ సలహా సహకారం అందిస్తూ, ప్రస్తుత ప్రోగ్రామ్‌లలో లోతైన పరిశ్రమ అనుసంధానాన్ని సాధించేందుకు విశ్వవిద్యాలయంతో సన్నిహితంగా పని చేస్తుంది. భాగస్వామ్యాన్ని ఆధారంగా చేసుకొని, భారత యువత కోసం ఉద్యోగోన్నత, నాణ్యమైన లెర్నింగ్ సిస్టమ్‌లను నిర్మించిన అనుభవాన్ని ఉపయోగించి అప్ గ్రాడ్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ ఫ్రేమ్‌వర్క్‌ను బలోపేతం చేస్తుంది. గ్లోబల్ విద్య ప్రపంచ స్థాయి టెక్నాలజీ లెర్నింగ్‌ను మా క్యాంపస్‌లకు తీసుకొస్తున్నాం. ఇప్పటివరకు 40,000కిపైగా ఇంజినీర్లను తయారు చేసిన ఎస్ ఎస్ ఏ హెచ్, ఇప్పుడు ఇన్నోవేషన్-ఆధారిత, పరిశ్రమలతో అనుసంధానమైన విద్య యుగంలోకి అడుగుపెడుతోంది.ఎస్ ఎస్ ఏ హెచ్ ఈ సలహాదారు డా. వివేక్ వీరయ్య మాట్లాడుతూ, "ఈ కార్యక్రమం ఎస్ ఎస్ ఏ హెచ్ ఈ క్యాంపస్‌లకు గ్లోబల్ విద్యను తీసుకువచ్చి, పరిశ్రమల ఆధారిత, అప్లికేషన్-ఫస్ట్ లెర్నింగ్‌ను నిరవధికంగా ఏకీకృతం చేస్తుంది. దీని ద్వారా ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు సిద్ధమైన టెక్నాలజిస్టుగా అవుతాడు" అన్నారు."భారతదేశ ఇంజినీరింగ్ విద్యకు విశ్వవిద్యాలయాలే ఎప్పటినుంచో వెన్నెముక. బలమైన సిద్ధాంత పునాదులు, అకాడెమిక్ కట్టుదిట్టతను అవి అందిస్తాయి. ఫ్రెషర్స్ కాకుండా పరిశ్రమకు సిద్ధమైన సహకారులుగా మారేలా రియల్ టైమ్‌లో శిక్షణ ఇవ్వడం" అని విశ్వ మోహన్ మరియు మెహుల్ ఖాంధేడియా సంయుక్త ప్రకటనలో తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com